PRGI NO : TGTEL/26/A2002

EDITOR: PEMBI MAHENDHAR

# నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 35 | పేజీలు : 8 | ఆదివారం 28 జూన్ 2026 | వెల : 4/-




## ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ సైజుపై

# పరిమితులు

- ముందుకు 3 అడుగులు చుట్టూ ఒక అడుగే
- ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ సైజుపై ప్రభుత్వం కీలక ఉత్తర్వులు
- ఇళ్ల స్లాబు 500 నుంచి 750 చదరపు అడుగులు మాత్రమే ఉండాలని జీవో
- లబ్ధిదారులు అప్పుల పాలవుతున్నారని గుర్తించిన గృహ నిర్మాణ సంస్థ
- ఉత్తర్వులు జారీ చేసిన గృహనిర్మాణ శాఖ కార్యదర్శి



హైదరాబాద్

తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వ్యయం లబ్ధిదారులకు భారంగా మారకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇళ్ల స్లాబ్ పరిమాణంపై పరిమితులు విధిస్తూ శనివారం నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. పేద లబ్ధిదారులు అనవసరపు ఖర్చులతో అప్పుల పాలు కాకుండా చూడటమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ విస్తీర్ణంపై ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఇందిరమ్మ ఇళ్ల స్లాబు 750 చదరపు అడుగులకు మించరాదని గృహ నిర్మాణ శాఖ స్పష్టం చేసింది. ముందు వైపు 3 అడుగులు, మిగతా వైపు ఒక అడుగు మాత్రమే ముందుకు రావాలని తెలిపింది. ఇంట్లోకి ఎండ, వర్షం రాకుండా అవసరమైతే సజ్జలు - మిగతా3లో



## నిజమైన శివసైనికులు నాతోనే ఉన్నారు

- రెబల్ ఎంపీలపై ఉద్ధవ్ ఠాక్రే ఫైర్?
- తిరుగుబాటు ఎంపీలపై ఉద్ధవ్ ఠాక్రే ఘాటు వ్యాఖ్యలు
- తిరుగుబాటు ఎంపీల నియోజకవర్గాల్లో పర్యటించనున్నట్లు ప్రకటన
- రూ.50 కోట్లకు ఎంపీ అమ్ముడుపోయారని సంజయ్ దేశ్‌ముఖ్‌పై ఆరోపణలు

## వీబీజీ రామ్‌జీ చట్టాన్ని అంగీకరించేది లేదు

- వీబీజీ రామ్‌జీ చట్టాన్ని అంగీకరించేది లేదు, అవసరమైతే సుప్రీంకు వెళ్తాం
- వీబీ-జీ రామ్ జీ పథకంపై కేబినెట్ సబ్ కమిటీ సమావేశం
- వీబీ-జీ రామ్ జీ పథకంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని యోచన
- రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం



హైదరాబాద్

వీబీ-జీ రామ్ జీ చట్టాన్ని యథాతథంగా అంగీకరించేది లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కేరళం, కర్ణాటకతో పాటు ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి పోరాటం చేస్తామని, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశం ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. రైతులు, వ్యవసాయ కూలీలకు నష్టం చేసే ఈ చట్టానికి తెలంగాణ ప్రభుత్వం తలవంచేది లేదని, అవసరమైతే ప్రత్యేక రాష్ట్ర ఉపాధి హామీ పథకం తీసుకొస్తామని స్పష్టం చేశారు. జులై 2న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సమగ్రంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. - మిగతా3లో



## కేంద్ర మంత్రికి రూ.99 లక్షల సబ్సిడీ..

- సొంత శాఖ నుంచే లబ్ధిపై వివాదం!
- ఇదో కొత్త తరహా అవినీతి అంటూ విపక్షాల తీవ్ర విమర్శ
- తాను రైతునేనని, 2018లోనే దరఖాస్తు చేసుకున్నానని మంత్రి వివరణ
- కోటి రూపాయలు మంజూరు చేయించుకోవడమేమిటని గెహ్లోట్ విమర్శలు



## రూ.500 ఖర్చు చేసినా సంచి నిండట్లే

- మార్కెట్‌లో ఏది కొందామన్నా పిరమే!
- రాష్ట్రంలో పెరిగిన నిత్యావసరాల ధరలు
- ఆదాయాన్ని మించి పెరుగుతున్న ఖర్చులు
- సామాన్యులపై తీవ్ర ప్రభావం

హైదరాబాద్

ఇటీవల కాలంలో మార్కెట్‌లో ధరలు చూస్తుంటే సామాన్య ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఓ వైపు ఇంధన ధరలు మండుతుండగా, మరోవైపు కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇలా ధరలు పెరగడంతో సామాన్యులపై తీవ్ర ప్రభావం పడుతోంది. సన్నబియ్యం, కోడి గుడ్లు, కూరగాయల ధరలు పెరిగి నెలవారీ ఖర్చులు ఎక్కువయ్యాయని వినియోగదారులు పేర్కొంటున్నారు. ఆదాయం పెరగకున్నా, ఖర్చులు పెరగడంతో ఇంటి బడ్జెట్ పూర్తిగా మారుతోందని వాపోతున్నారు. రాష్ట్రంలో ఎన్నో కుటుంబాలుండగా ఇందులో మెజారిటీ ప్రజలపై ధరల భారం పడుతోంది. రోజువారీ - మిగతా3లో

## మూసీ నిర్వాసితులకు

# డబుల్ బెడ్‌రూం

- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం
- మూసీ రివర్ ఫ్రంట్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష
- మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని ఆదేశం
- భూసేకరణ ఆసక్తి ఉన్నవాళ్లకు టీడీఆర్ ఇవ్వాలి.. లేదా పరిహారం చెల్లించాలని సూచన



హైదరాబాద్

మూసీ రివర్‌బెడ్‌లో నివసిస్తున్న వారికి మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టు కింద డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు కోసం భూములిచ్చేందుకు ముందుకు వచ్చే వారికి టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) లేదా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించాలని సూచించారు. మూసీ తొలి దశ అభివృద్ధిపై మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో శుక్రవారం రాత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం రక్షణ శాఖ నుంచి తీసుకుంటున్న భూముల్లో ఉన్న నిర్మాణాల్ని రాష్ట్ర ప్రభుత్వమే తరలించేలా చర్యలు చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు లక్ష్యాలు, చేపట్టబోయే అభివృద్ధి పనులు, భవిష్యత్‌లో రూపురేఖలను ప్రజలకు - మిగతా3లో



## చిరకాల స్నేహాన్ని మరింత బలోపేతం చేసే చర్చల కోసం ఎదురుచూస్తున్నాను

- సీషెల్స్ పర్యటనకు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ
- మూడు రోజుల పాటు ఆ దేశంలో పర్యటించనున్న ప్రధాని
- కీలక అంశాలపై చర్చలు జరిపే అవకాశం
- భద్రత, శ్రేయస్సును పెంపొందించడానికి భారత్, సీషెల్స్ కలిసికట్టుగా కృషి చేస్తాయి



## ఇది యువత భవిష్యత్తును దొంగిలించడమే

- టెట్ పేపర్ లీక్‌పై రాహుల్ గాంధీ ఫైర్
- దేశంలోని విద్యా వ్యవస్థను దోపిడీ వ్యవస్థగా మార్చేశారన్న కాంగ్రెస్ అగ్రనేత
- ప్రశ్నాపత్రాల లీక్ వల్ల యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందన్న రాహుల్
- టెట్ ప్రశ్నపత్రాల సెట్‌ను రూ.1.5 కోట్లకు ఒప్పందం కుదిరినట్లు గుర్తించిన పోలీసులు


## రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు

- గుజరాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన కేంద్రమంత్రి
- రాబోయే రెండేళ్లలో దేశంలోని 500కు పైగా నగరాలకు సేవలు విస్తరించనున్నట్లు ప్రకటన
- ఈ జులై 31 లోపు ఏడు ప్రధాన నగరాల్లో కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు వెల్లడి
- డ్రైవర్లను భాగస్వాములుగా చేసే సహకార నమూనాతో ఈ ప్లాట్‌ఫామ్ పనిచేస్తుందన్న అమిత్ షా
- 'సహకారం ద్వారానే శ్రేయస్సు' అనే ప్రధాని మంత్రాన్ని సాకారం చేస్తున్నట్లు వ్యాఖ్య




## రీసెర్చ్ పేపర్ల ఉపసంహరణ

- ప్రపంచంలో చైనా తర్వాత భారత్ రెండో స్థానం
- ఉపసంహరణలో గ్లోబల్ టాప్ 10 జాబితాలో ఆరు భారత యూనివర్సిటీలు
- చెన్నై అన్నా యూనివర్సిటీకి తొలి స్థానం, హైదరాబాద్ జేఎన్‌టీయూకు ఐదో ర్యాంక్
- నాణ్యతను పక్కనపెట్టడమే ప్రధాన కారణం



నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం
28 జూన్ 2026

## చిరకాల స్నేహాన్ని మరింత బలోపేతం చేసే

# చర్చల కోసం ఎదురుచూస్తున్నాను

ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోజుల పర్యటన (జూన్ 27–29) నిమిత్తం శనివారం సీషెల్స్‌కు బయలుదేరారు. ఈ పర్యటనలో ఆయన సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవ వేడుకలకు హాజరుకానున్నారు. అలాగే సీషెల్స్‌తో భారత్ స్నేహాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఆ దేశ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినితో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఈ నేపథ్యంలో సీషెల్స్ బయలుదేరే ముందు మోదీ ప్రకటన విడుదల చేశారు. భారత్‌కు సీషెల్స్ ఒక విలువైన సముద్ర పొరుగు దేశమని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. 'విజన్ మహాసాగర్', గ్లోబల్ సౌత్ పట్ల భారత్‌కు ఉన్న ఉమ్మడి నిబద్ధతలో సీషెల్స్ ఒక కీలక భాగస్వామి అని తెలిపారు. సీషెల్స్‌తో చిరకాల స్నేహాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో జరగనున్న ద్వైపాక్షిక చర్చల కోసం తాను ఎదురుచూస్తున్నానని వెల్లడించారు. పరస్పర విశ్వాసం, గౌరవం, ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలతో పాతుకుపోయిన భారత్–సీషెల్స్ దౌత్య సంబంధాలు ఏర్పడి ఈ ఏడాదికి 50 ఏళ్లు పూర్తవుతున్నాయని అన్నారు. "హిందూ మహాసముద్ర ప్రాంతంలో భద్రత, శ్రేయస్సును పెంపొందించడానికి భారత్, సీషెల్స్ కలిసికట్టుగా కృషి చేస్తాయి. సీషెల్స్ అధ్యక్షుడు హెర్మిని ఆహ్వానం మేరకు జూన్ 27–29 తేదీల మధ్య ఆ దేశంలో పర్యటిస్తున్నాను. ఈ సందర్భంగా సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవ వేడుకల్లో గౌరవ అతిథిగా పాల్గొంటాను. ఈ చారిత్రక అవకాశం రెండు దేశాలను కలిపి ఉంచే బలమైన ప్రజాస్వామ్య విలువలను, పార్లమెంటరీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో సీషెల్స్ అధ్యక్షుడు హెర్మిని భారత్ పర్యటన స్ఫూర్తితో ఇరు దేశాల చిరకాల స్నేహాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో జరగబోయే చర్చల కోసం ఎదురుచూస్తున్నాను."

**ప్రవాస భారతీయులను కలవడం కోసం ఎదురుచూస్తున్నాను : మోదీ**

రెండు దేశాల మధ్య సజీవ వారధిగా నిలుస్తున్న సీషెల్స్‌లోని చైతన్యవంతమైన ప్రవాస భారతీయులతో మమేకమవ్వడానికి తాను ఎదురుచూస్తున్నానని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. "నా పర్యటన ఇరు దేశాల మధ్య ఉన్న చిరకాల బంధాలను మరింత బలోపేతం చేస్తుంది. హిందూ



మహాసముద్ర ప్రాంతంలో సముద్ర సహకారాన్ని పెంపొందిస్తుంది. సురక్షితమైన, శాంతియుతమైన, సుసంపన్నమైన హిందూ మహాసముద్ర ప్రాంతం అనే మన ఉమ్మడి ఆశయాన్ని ముందుకు తీసుకెళ్తుంది. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినితో చర్చలు జరపడానికి ఎదురుచూస్తున్నాను. రెండు దేశాలు దౌత్య సంబంధాలు 50వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న తరుణంలో నేను సీషెల్స్‌లో పర్యటిస్తున్నాను. ఈ పర్యటన సందర్భంగా సీషెల్స్ జాతీయ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించే తొలి భారత ప్రధానిగా నిలిచే గౌరవం నాకు దక్కనుంది. " అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**మోదీకి స్వాగతం పలుకుతూ పోస్టర్లు**

మరోవైపు తమ దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించనున్న నేపథ్యంలో విక్టోరియా–మహే ప్రాంతంలో సందడి నెలకొంది. అక్కడ ప్రవాస భారతీయులు నరేంద్ర మోదీకి స్వాగతం పలుకుతూ పోస్టర్లను ఏర్పాటు చేశారు. దీంతో సీషెల్స్ రాజధాని నగరం విక్టోరియాలో పండుగ వాతావరణం ఏర్పడింది. కాగా, 2015లో ప్రధాని మోదీ చివరిసారిగా సీషెల్స్‌లో పర్యటించారు. మళ్లీ 11 ఏళ్ల తర్వాత ఆ దేశ పర్యటనకు వెళ్లారు.

**విదేశాంగ శాఖ కీలక ప్రకటన**

సీషెల్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోజుల పర్యటన నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ కీలక ప్రకటన చేసింది. ఇరు దేశాధినేతలు రక్షణ, సముద్ర భాగస్వామ్యంపై చర్చలు జరపనున్నట్లు తెలిపింది. ఈ పర్యటన సందర్భంగా భారత్–సీషెల్స్ పరస్పర సహకారాన్ని పూర్తి స్థాయిలో సమీక్షించడానికి, పరస్పరం ఆసక్తి ఉన్న ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలను పంచుకోవడానికి హెర్మినితో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరుపుతారని వెల్లడించింది. అలాగే ప్రధాని మోదీ సీషెల్స్ జాతీయ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగిస్తారని పేర్కొంది. ప్రవాస భారతీయులతో కూడా మాట్లాడుతారని స్పష్టం చేసింది.

# నిజమైన శివసైనికులు నాతోనే ఉన్నారు

శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు లోక్‌సభ సభ్యులు ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేనలో చేరిన నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే స్పందించారు. కొందరు ఎంపీలు పార్టీని వీడినంత మాత్రాన శివసేన బలహీనపడదని, "నిజమైన శివసైనికులు నాతోనే ఉన్నారు" అని స్పష్టం చేశారు. పదవుల కోసం కొందరు పార్టీ మారినా, క్షేత్రస్థాయిలో కార్యకర్తలు, ప్రజల మద్దతు తమకే ఉందని అన్నారు. తిరుగుబాటు చేసిన ఎంపీల నియోజకవర్గాల్లో పర్యటించి పార్టీని మరింత బలోపేతం చేస్తానని ఉద్ధవ్ ఠాక్రే ప్రకటించారు. యవత్‌మాల్ పర్యటన సందర్భంగా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన ఉద్ధవ్ ఠాక్రే, తిరుగుబాటు చేసిన ఎంపీలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "నిజమైన శివసైనికులు నాతోనే ఉన్నారు. మిగిలిన వారి ప్రవర్తనను ప్రజలంతా చూస్తున్నారు. అలాంటి వ్యక్తులు ఇంతకాలం మనతో కలిసి ఉండటం సిగ్గుగా అనిపిస్తోంది" అని వ్యాఖ్యానించారు. పదవులు, రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు పార్టీ మారినా, క్షేత్రస్థాయిలో కార్యకర్తలు మాత్రం తమ వెంటే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల విశ్వాసమే తమకు అతిపెద్ద బలమని ఉద్ధవ్ పేర్కొన్నారు. తిరుగుబాటు చేసిన ఎంపీల నియోజకవర్గాల్లో తాను స్వయంగా పర్యటించి పార్టీ కార్యకర్తలను కలుస్తానని వెల్లడించారు. అక్కడ పార్టీని మరింత బలోపేతం చేసే కార్యాచరణ చేపడతామని చెప్పారు. త్వరలో నాగ్‌పుర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించి పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్ని నింపనున్నట్లు వెల్లడించారు.

**శివసేన ఎప్పుడూ అంతమవ్వదు**

ఇదిలా ఉండగా శివసేన (యూబీటీ) రాజ్యసభ సభ్యుడు



సంజయ్ రౌత్ కూడా తిరుగుబాటు ఎంపీలపై తీవ్ర విమర్శలు చేశారు. "శివసేన అంతమైపోదు. ఠాక్రేలు ఎప్పుడూ ముగిసిపోరు. బూడిదలో నుంచి మళ్లీ లేచి నిలబడతారు" అంటూ వ్యాఖ్యానించారు. పార్టీని వీడిన వారు శివసేనను బలహీనపరచలేరని, నిజమైన శివసైనికులు ఇప్పటికీ ఉద్ధవ్ ఠాక్రే వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. అంతే కాకుండా తిరుగుబాటు ఎంపీ సంజయ్ దేశ్‌ముఖ్‌ను లక్ష్యంగా చేసుకుని రౌత్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన రూ.50 కోట్లకు అమ్ముడుపోయారని ఆరోపించారు. "వ్యవసాయ మార్కెట్‌లో సరుకులకు విలువ లేదు. కానీ 15 రోజుల క్రితం ఇక్కడ రూ.50 కోట్లకు ఒక 'సరుకు' అమ్ముడుపోయింది. ఆయనే మీ ఎంపీ. ఆయన రాజకీయంగా ముగిసిపోయారు. ఇప్పుడు ఆయనకు తుది సంస్కారాలు చేసి ముందుకు సాగండి."

**ప్రజలే తగిన సమాధానం చెబుతారు**

శివసేన (యూబీటీ)తో తాము కొనసాగడం ఎవరికీ చేసిన ఉపకారం కాదని రౌత్ అన్నారు. పార్టీ సిద్ధాంతాలు, బాలాసాహెబ్ ఠాక్రే ఆశయాలపై విశ్వాసంతోనే తాము విధేయంగా ఉన్నామని చెప్పారు. ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వం వల్లే కొందరు నేతలకు రాజకీయ విలువ వచ్చిందని, రానున్న ఎన్నికల్లో ప్రజలే వారికి తగిన సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు. భారతీయ జనతా పార్టీపై కూడా రౌత్ విమర్శలు గుప్పించారు. అభివృద్ధి కోసమే పార్టీ మారామని తిరుగుబాటు నేతలు చెబుతున్నారని, అయితే 12 ఏళ్ల పాలనలో దేశంలో ఎంత అభివృద్ధి జరిగిందో ప్రధాని నరేంద్ర మోదీ సొంత నియోజకవర్గమైన వారణాసిని చూస్తే అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. అక్కడ ఇప్పటికీ రహదారులు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల సమస్యలు ఉన్నాయని విమర్శించారు. ఇటీవల శివసేన (యూబీటీ)కి చెందిన పలువురు లోక్‌సభ సభ్యులు ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేనలో చేరడంతో మహారాష్ట్ర రాజకీయాల్లో కొత్త పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్ధవ్ ఠాక్రే, సంజయ్ రౌత్ వరుసగా స్పందిస్తూ పార్టీ కార్యకర్తల్లో ధైర్యం నింపే ప్రయత్నం చేస్తున్నారు. తిరుగుబాట్లు వచ్చినా శివసేన (యూబీటీ) మరింత బలోపేతమవుతుందని, ప్రజల మద్దతుతో ముందుకు సాగుతామని పార్టీ నాయకత్వం స్పష్టం చేస్తోంది.

# రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు

రవాణా రంగంలో సహకార స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో 'భారత్ ట్యాక్సీ' దేశవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించబోతోందని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. రాబోయే రెండు సంవత్సరాల్లో దేశంలోని 500కు పైగా నగరాలు, పట్టణాల్లో ఈ సహకార మొబిలిటీ ప్లాట్‌ఫామ్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన స్పష్టం చేశారు. నేడు గుజరాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన సందర్భంగా అమిత్ షా ఈ కీలక ప్రకటన చేశారు. గుజరాత్‌లోని అన్ని ప్రధాన నగరాల్లో టూ–వీలర్లు, ఆటో–రిక్షాలు, ఫోర్–వీలర్లు అనే మూడు విభాగాల్లోనూ భారత్ ట్యాక్సీ సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయని అమిత్ షా తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా సేవలు అందిస్తున్న ఈ ప్లాట్‌ఫామ్, ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయి కార్యకలాపాలు మొదలుపెట్టిందని వివరించారు. ఈ సంస్థ జాతీయ విస్తరణలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. విస్తరణ ప్రణాళికల గురించి వివరిస్తూ.. రాబోయే నెలల్లో దేశవ్యాప్తంగా భారత్ ట్యాక్సీ వేగంగా కార్యకలాపాలు ప్రారంభిస్తుందని ఆయన అన్నారు. "ఈ వేదిక నుంచి నేను స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. రాబోయే ఏడాదిన్నర నుంచి రెండేళ్లలోపు, మేము 500కు పైగా నగరాలకు చేరుకుంటాం. దేశంలో సేవలు అందని ప్రదేశమంటూ ఉండదు" అని అమిత్ షా నొక్కి చెప్పారు. జులై 31వ తేదీలోగా నాగ్‌పూర్,



పుణే, ముంబై, లక్నో, చండీగఢ్, జైపూర్, కోల్‌కతా వంటి ఏడు కీలక నగరాల్లో సేవలు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు. భారత్ ట్యాక్సీ ప్రత్యేకత సహకార నమూనా అని అమిత్ షా తెలిపారు. ఇందులో డ్రైవర్లు కేవలం కాంట్రాక్టర్లుగా కాకుండా సంస్థలో వాటాదారులుగా, సభ్యులుగా ఉంటారని ఆయన స్పష్టం చేశారు. "ఇప్పటికే సుమారు ఏడు లక్షల మంది 'సారథులు' (డ్రైవర్–సభ్యులు) భారత్ ట్యాక్సీ కుటుంబంలో భాగమయ్యారు. ఈ రోజు మీరు కూడా ఈ కుటుంబంలో చేరడం చాలా సంతోషంగా ఉంది" అని గుజరాత్‌లో కొత్తగా చేరిన సభ్యులను ఉద్దేశించి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన 'సహకారం ద్వారానే శ్రేయస్సు' అనే మంత్రాన్ని సాకారం చేసేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని అమిత్ షా పేర్కొన్నారు. మొబిలిటీ, రవాణా రంగాల్లో సహకార ఉద్యమాన్ని విస్తరించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. భారత్ ట్యాక్సీలో చేరడం ద్వారా డ్రైవర్లు తమ శ్రేయస్సు, గౌరవం, భద్రతకు మార్గం సుగమం చేసుకున్నారని ఆయన అన్నారు. భవిష్యత్తులో భారత రవాణా రంగంలో భారత్ ట్యాక్సీ ఒక ప్రధాన సహకార సంస్థగా ఎదుగుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## 'ఇది యువత భవిష్యత్తును దొంగిలించడమే'



మహారాష్ట్ర టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ ప్రశ్నాపత్రం లీక్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలోని విద్యా వ్యవస్థను దోపిడీ వ్యవస్థగా మార్చేశారని ఆరోపించారు. ప్రశ్నాపత్రాల లీక్ వల్ల యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. "మరోసారి ప్రశ్నపత్రం లీక్. మరో పరీక్ష రద్దు. ఈసారి, మహారాష్ట్ర ఎజుు పరీక్ష. దేశంలోని విద్యా పరీక్షల వ్యవస్థ ఒక దోపిడీ వ్యవస్థగా మారిపోయింది. దీనివల్ల దేశంలోని యువత అంతా అభద్రతాభావంలో పడిపోయారు. ఇది కేవలం ప్రశ్నపత్రం లీక్ మాత్రమే కాదు, ఇది యువత భవిష్యత్తును దొంగిలించడమే."

ఇదిలా ఉండగా, థానే జిల్లాలోని భివాండీ పట్టణంలో టెట్ పేపర్ లీక్ జరిగినట్లు పోలీసులకు సమాచారం అందింది. టెట్ అసలు ప్రశ్నపత్రంలోని ప్రశ్నలను పోలి ఉన్న కొన్ని పత్రాలు కొందరి వద్ద ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆదివారం జరగాల్సిన ఎజుు–2026 పరీక్షను వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి భివాండీ పోలీసులు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. అయితే, దిల్లీ నుంచి భివాండికి తీసుకువచ్చిన ఎజుు ప్రశ్నపత్రాల సెట్‌ను రూ.1.5 కోట్ల భారీ మొత్తానికి విక్రయించేందుకు ఒప్పందం జరిగినట్లు పోలీసులు గుర్తించారు.

మరోవైపు, టెట్‌ను పూర్తి పారదర్శకతతో పరీక్షను నిర్వహించడానికి కట్టుబడి ఉన్నామని మహారాష్ట్ర స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎగ్జామినేషన్ (ఎంఎస్?సీఈ) ఒక ప్రకటనలో పేర్కొంది.

## కేంద్ర మంత్రికి రూ.99 లక్షల సబ్సిడీ



కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి వివాదంలో చిక్కుకున్నారు. తన సొంత మంత్రిత్వ శాఖ పరిధిలోని పథకం ద్వారా ఆయన ఏకంగా రూ.99.03 లక్షల సబ్సిడీని పొందడం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. దీనిని కొత్త తరహా అవినీతిగా అభివర్ణిస్తూ విపక్షాలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. రాజస్థాన్‌లోని పర్బత్‌సర్ తహసీల్ పీహ్ గ్రామంలో గల చౌదరి కుటుంబ వ్యవసాయ క్షేత్రంలో వాణిజ్యపరంగా దోసకాయల సాగు నిమిత్తం ఈ సబ్సిడీ మంజూరైంది. జాతీయ ఉద్యానవన బోర్డు ఈ ప్రాజెక్టుకు 2026 మార్చి 11న తుది ఆమోదం తెలిపింది. మార్చి 30న సబ్సిడీ మొత్తం ఆయన బ్యాంక్ ఖాతాలో జమ అయింది. వ్యవసాయ మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేసే ఈ జాతీయ ఉద్యానవన బోర్డుకు భగీరథ్ చౌదరి ఎక్స్–అఫీషియో వైస్–ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తుండటమే ఈ వివాదానికి ప్రధాన కారణమైంది. ఈ ఆరోపణలను మంత్రి భగీరథ్ చౌదరి తీవ్రంగా ఖండించారు. "నేను ఒక రైతును, చిన్నతనం నుంచే వ్యవసాయం చేస్తున్నాను. ఇందులో దాచాల్సింది ఏమీ లేదు. వేలాది మంది రైతులు పాలీహౌస్‌లు ఏర్పాటు చేసుకుని సబ్సిడీలు పొందుతున్నారు, నేను కూడా అదే నిబంధనల ప్రకారం పొందాను. దీనికోసం 2018లోనే దరఖాస్తు చేసుకున్నాను" అని ఆయన స్పష్టం చేశారు. తన ఫామ్‌లో తీసుకున్న రుణాలు, సబ్సిడీల వివరాలతో కూడిన బోర్డును అక్కడ ప్రదర్శిస్తున్నామని, ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ కూడా ఇస్తున్నామని ఆయన వివరించారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు దాడిని ఉద్ధృతం చేసింది. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ స్పందిస్తూ, "కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రిగా ఉండి, తన సొంత మంత్రిత్వ శాఖలోని పథకం కింద తన క్షేత్రానికే కోటి రూపాయల సబ్సిడీ మంజూరు చేయించుకోవడాన్ని ఏమనాలి?" అని ప్రశ్నించారు. ఇది మోదీ ప్రభుత్వంలో అవినీతికి నిదర్శనమని ఆయన విమర్శించారు. 'మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్' కింద వాణిజ్య ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ సబ్సిడీలు అందిస్తోంది. అయితే, మంత్రి నేరుగా పర్యవేక్షించే కమిటీ కాకుండా, మరో ప్రాజెక్ట్ ఆమోద కమిటీ ఈ సబ్సిడీకి అనుమతి ఇచ్చిందని రికార్డులు వెల్లడిస్తున్నాయి.

## రీసెర్చ్ పేపర్ల ఉపసంహరణ



అంతర్జాతీయ పరిశోధన రంగంలో అగ్రగామిగా ఎదగాలని ఆకాంక్షిస్తున్న భారత్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. పరిశోధన పత్రాల ఉపసంహరణ (రిట్రాక్షన్)లో అంతర్జాతీయ స్థాయిలో మన దేశం రెండో స్థానంలో నిలవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. 2025 సంవత్సరానికి సంబంధించి ప్రపంచవ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో పరిశోధన పత్రాలను వెనక్కి తీసుకున్న తొలి పది విశ్వవిద్యాలయాల జాబితాలో ఏకంగా ఆరు భారతీయ వర్సిటీలు ఉండటం గమనార్హం. ఈ వివరాలను 'రిట్రాక్షన్ వాచ్' డేటాబేస్ వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం, 2025లో చైనా 1,701 పరిశోధన పత్రాల ఉపసంహరణతో ప్రథమ స్థానంలో ఉండగా, భారత్ 887 రిట్రాక్షన్లతో ద్వితీయ స్థానంలో నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనల్లో మన దేశం వాటా కేవలం 5 శాతమే అయినప్పటికీ, ఉపసంహరణల్లో మాత్రం 21 శాతం వాటాను కలిగి ఉండటం పరిశోధనల నాణ్యతా ప్రమాణాలపై పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ జాబితాలో చెన్నైలోని అన్నా యూనివర్సిటీ 161 రిట్రాక్షన్లతో అంతర్జాతీయంగా మొదటి స్థానంలో నిలిచింది. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం టెక్నికల్ యూనివర్సిటీ (160), సవీత ఇన్‌స్టిట్యూట్ (159) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ 104 రిట్రాక్షన్లతో ఐదో స్థానంలో నిలవగా, లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ 98 ఉపసంహరణలతో ఆరో స్థానంలో నిలిచింది. నాణ్యత ప్రమాణాలను విస్మరించి పరిశోధన పత్రాలను ప్రచురించడమే ఈ దుస్థితికి ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. పరిశోధనలో లోపాలు, అవాస్తవిక ఫలితాలు, కృత్రిమ మేధ (ఏఐ) వాడకం వంటి కారణాల వల్ల పలు జర్నళ్లు ఈ పత్రాలను తిరస్కరించాయి. ఈ పరిణామాలను తీవ్రంగా పరిగణించిన కేంద్ర ప్రభుత్వం, 2025 నుంచి నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)లో రిట్రాక్షన్లకు పెనాల్టీలు విధించడం వంటి కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం
28 జూన్ 2026

# ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ సైజుపై పరిమితులు

-మొదటిపేజీ తరువాయి

నిర్మించుకోవాలని సూచించింది. స్లాబ్ ఎక్కువ వేసి ఖర్చు పెరగడంతో లబ్ధిదారులు అనవసర అప్పులు చేస్తున్నట్లు గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు గృహ నిర్మాణ శాఖ వెల్లడించింది. కొత్త వాటితో పాటు ప్రస్తుతం రూఫ్ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేసింది.

ఇందిరమ్మ ఇళ్ల స్లాబు ఇక నుంచి ఇష్టం వచ్చిన సైజులో నిర్మించడానికి వీల్లేదు. స్లాబు ఎంత విస్తీర్ణం ఉండాలో ప్రభుత్వం విధివిధినాలు వెల్లడించింది. స్లాబు 700 చదరపు అడుగులకు మించరాదని స్పష్టం చేస్తూ గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి.గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సుమారు లక్ష ఇందిరమ్మ ఇళ్లు పూర్తి కాగా, మరో లక్ష ఇళ్లు ఈ సెప్టెంబర్ నాటికి పూర్తవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు రెండో విడత ఇళ్ల కేటాయింపునకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

స్థలం ఉన్న వారు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేస్తోంది. అయితే ఖర్చు ఎక్కువవుతోందని కొందరు మధ్యలో నిర్మాణాలు ఆపడం, మరికొందరు ప్రారంభించక పోవడాన్ని గుర్తించిన హౌసింగ్ కార్పొరేషన్ వ్యయంపై అధ్యయనం చేసింది. చాలా మంది స్లాబ్ ఎక్కువ సైజులో నిర్మిస్తున్నట్లు గుర్తించింది. కొంతమంది గోడల కన్నా సుమారు 8 అడుగుల వరకు ముందుకొస్తున్నట్లు హౌసింగ్ అధికారులు తెలిపారు. పెద్ద స్లాబు నిర్మించడం వల్ల ఖర్చు పెరిగి, కొందరు లబ్ధిదారులు అప్పులు చేయాల్సి వచ్చి నిర్మాణాన్ని మధ్యలో నిలిపివేస్తున్నట్లు గుర్తించారు. దానివల్ల పేదలు ఇళ్లు నిర్మాణం కోసం సబ్సిడీ నిధులు ఇచ్చే ప్రధాన లక్ష్యమే దెబ్బతింటోందని ప్రభుత్వం పేర్కొంది.

వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని స్లాబ్ విస్తీర్ణంపై పరిమితులు విధించాలని హౌసింగ్ కార్పొరేషన్ కోరడంతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంటి ముందు వైపు గోడల కన్నా 3 అడుగులు, మిగతా వైపు ఒక అడుగు మాత్రమే స్లాబ్ ఉండాలని జీవోలో ప్రభుత్వం స్పష్టం చేసింది.



ఉదాహరణకు 400 చదరపు అడుగుల ఇంటికి 500 చదరపు అడుగుల వరకు, 600 ఎస్ఎఫ్‌టీ ఇంటికి 750 చదరపు అడుగుల వరకు మాత్రమే స్లాబు ఉండాలని పరిమితి విధించింది. ఇంటిలో ఎండ, వాన రాకుండా ఉండేందుకు స్లాబు పెంచడానికి బదులుగా తలుపులు, కిటికీల పైన సజ్జలు, సన్‌షేడ్‌లు నిర్మించేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని హౌసింగ్ కార్పొరేషన్ అధికారులకు ప్రభుత్వం తెలపింది.

ఎండ రాకుండా ఆర్‌సీసీ స్లాబు పెంచే బదులుగా అవసరమైతే రేకులు వేసుకునేలా లబ్ధిదారులకు వివరించాలని పేర్కొంది. కొత్తగా నిర్మించే ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఇప్పుడు బేస్‌మెంట్, రూఫ్ లెవెల్‌లో ఉన్న నిర్మాణాలకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయని ప్రభుత్వం వెల్లడించింది. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సిబ్బంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించింది.

ఎండ, వానల నుంచి రక్షణ కోసం భారీ ఆర్‌సీసీ స్లాబులకు బదులుగా కిటికీలు, తలుపులపై సన్‌షేడ్లు, టైల్డ్ రూఫ్‌లు ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఇందిరమ్మ పథకం కింద అర్హులైన పేదలకు సొంత ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ సాయం దుర్వినియోగం కాకుండా, లబ్ధిదారులకు భారం కలగకుండా గృహ నిర్మాణం పూర్తి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఈ కొత్త నిబంధనలపై లబ్ధిదారులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బందిని ప్రభుత్వం ఆదేశించింది.

# రూ.500 ఖర్చు చేసినా సంచి నిండట్లే

-మొదటిపేజీ తరువాయి

కూలీలు, ఆటో డ్రైవర్లు, చిన్న ఉద్యోగులు, పింఛన్‌పై ఆధార పడేవారు, చిన్న వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**సన్నబియ్యం షాక్**

గత నెలలో 26 కిలోల సన్నబియ్యం సంచి రూ.1,400 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.1600 నుంచి రూ.1700ల వరకు చేరింది. ఒక్కో కుటుంబానికి నెలకు రూ.200 నుంచి రూ.250 వరకు అదనపు భారం పడుతోంది. గడిచిన 20 రోజుల్లోనే 15 నుంచి 20 శాతం వరకు ధరలు పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు. అలాగే రాష్ట్రాల్లో ఇతర ఉత్పత్తి తగ్గడంతో పాటు తెలంగాణలో సన్నాలకు బోనస్ ఇచ్చి ప్రభుత్వం కొనుగోలు చేయడంతో మార్కెట్లోకి వచ్చే ధాన్యం తగ్గిపోయింది. పలు జిల్లాలో ఎక్కువగా వినియోగించే జైశ్రీరాం, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ, బీపీటీ రకాల ధరలు పెరిగాయి.

**ఇతర రాష్ట్రాల నుంచి విక్రయాలు**

మార్కెట్లో ఉల్లి ధర ఘాటెక్కి కిలో రూ.40కి చేరింది. రూ.30 వరకు కిలో ఉన్న టమాట పది రోజుల క్రితం రూ.60 వరకు చేరి ఇప్పుడు రూ.40కు చేరింది. పచ్చి మిర్చి, పప్పులు, వంటనూనె ఇలా వంటింటి ధరలు ప్రతి ఇంటింటా సెగలు పుట్టిస్తున్నాయి. వర్షాలు సకాలంలో కురవకపోవడం, రవాణా ఖర్చుల భారం, రైతులు కూరగాయల సాగు తగ్గించడం మూలంగా ఉమ్మడి కరీంనగర్? జిల్లాలో కూరగాయల ధరలు పెరుగుదలకు కారణమవుతున్నాయి. టమాట ఏపీ నుంచి, ఉల్లి మహారాష్ట్ర నుంచి, కీరదోస, క్యారెట్? బెంగళూరు, పచ్చిమిర్చి అనంతపురం, ఆలుగడ్డ హైదరాబాద్? నుంచి వస్తున్నాయి. వంటిమామిడి మార్కెట్ నుంచి కూడా పలు కూరగాయలను హోల్?సేల్?గా తెచ్చి విక్రయిస్తున్నారు.

**కొండెక్కిన కోడిగుడ్డు**

కోడిగుడ్ల ధర పెరుగుతుండటంతో సామాన్య, మధ్య తరగతి



కుటుంబాలపై అదనపు భారం పడుతోంది. అయితే ఇటీవల ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడం కారణంగా పోషకాహారం కోసం గుడ్ల వినియోగం విపరీతంగా పెరిగింది. గతంలో రూ.5 నుంచి రూ.6 వరకు ఉన్న గుడ్డు ధర ప్రస్తుతం రూ.7 నుంచి రూ.8 వరకు పెరగడం వల్ల ఇది కాస్త నెలవారీ ఖర్చులపై ప్రభావం చూపుతోంది. మరోవైపు కోళ్లదాణా ధరలు పెరగడం వల్ల ఉత్పత్తి ఖర్చు పెరగడం మూలంగానే గుడ్ల ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

**మరింత పెరిగే అవకాశం**

ఇవి తెలంగాణ రాష్ట్రం నుంచి పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక, అస్సాం రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఏప్రిల్‌లో యుద్ధం కారణంగా గుడ్ల ధరలు పడిపోయాయి. ఒక గుడ్డు ఉత్పత్తి కావాలంటే రైతుకు కనీసం సరాసరి రూ.5.50 ఖర్చు వస్తుంది. ఏప్రిల్?లో రైతులు రూ.3.50కే విక్రయించారు. మే నెలలో రూ.5.60కు, జూన్? 18 నుంచి రూ.6.35కు విక్రయిస్తున్నారు. ఇది మార్కెట్‌లోకి వచ్చేసరికి గుడ్డపై రూపాయి నుంచి రూ.1.20కు పెరుగుతుంది. అయితే రానున్న రోజుల్లో ధర మరింత పెరిగే అవకాశం ఉందని కోళ్ల రైతులు చెబుతున్నారు.

# 'మా ప్రాంతం మళ్లీ మునిగిపోయేలా ఉంది ఇకనైనా చర్యలు చేపట్టండి సారూ'

వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆ ప్రాంత వాసులకు కంటి మీద కునుకులేకుండా పోతోంది. వరదల నుంచి ఎలా గట్టెక్కాలని బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. అందరికి వానాకాలం ఓ వరమైతే! ఆ కాలనీలకు మాత్రం శాపంలా మారుతోంది. గతేడాది భారీ వర్షాలతో ప్రళయంగా మారిన కామారెడ్డి జిల్లాలోని వరద బాధితులకు ఆ విపత్తు ఇంకా కళ్ల ముందు కదలాడుతోంది. ఏటా తమ ప్రాంతాలు నీట మునుగుతున్నా ప్రభుత్వం ఎందుకు నివారణ చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద ముప్పు నుంచి తమను రక్షించాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

**ముందస్తు చర్యల్లో ముందడుగు లేక**

గతేడాది కురిసిన కుండపోత వర్షాలతో కామారెడ్డి జిల్లా ఛిన్నాభిన్నమైంది. మునుపెన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 41 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో పట్టణంలోని హౌజింగ్ బోర్డుతో పాటు పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. కొన్ని కాలనీలోని బాధితులు ఇళ్లను వదిలి పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాల్సిన దుస్థితి వాటిల్లింది. వరద ముప్పునకు తాత్కాలిక మరమ్మతులే చేస్తున్నారే కానీ, శాశ్వత పరిష్కార మార్గాలు కనిపించడం లేదు. వేసవి కాలంలోనే ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉండగా ఆ పనుల్లో మాత్రం ముందడుగు పడలేదు. స్వల్ప వర్షాలకే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక భారీ వర్షాలు పడితే గత పరిస్థితే మళ్లీ పునరావృతమయ్యే పరిస్థితి నెలకొంది.



**20 నిమిషాలు వర్షం కురిస్తే చాలు**

ప్రస్తుతం కామారెడ్డి పట్టణంలో లక్షకు పైచిలుకు జనాభా ఉంది. ప్రతి సంవత్సరం ప్రాంత పరిధి విస్తరిస్తుండటంతో కొత్త కాలనీలు వెలుస్తున్నాయి. కానీ వీటికి అనుగుణంగా మురికి కాల్వల విస్తరణ, వర్షపు నీరు వెళ్లేందుకు సరైన చర్యలను అధికార యంత్రాంగం చేపట్టడం లేదు. చిన్నపాటి వర్షం కురిసిన 20 నిమిషాల్లోనే కాలనీలు జలమయమవుతున్నాయి. అలా ఏటా కాలనీలు ముంపునకు గురవుతున్నా, అధికారులకు మాత్రం కనువిప్పు కలగడం లేదు. అధికారులు వరదల బారి నుంచి ఎలా రక్షించుకోవాలో చెబుతున్నారు కానీ, ఈ సమస్యకు శాశ్వత పరిష్కార మార్గాలు మాత్రం చూపడం లేదంటూ స్థానికులు వాపోతున్నారు. "గతేడాది వరదలు సంభవించి అన్ని మౌలిక వసతులు దెబ్బతిన్నాయి. మళ్లీ ఈ సంవత్సరం వర్షాలు మొదలైనప్పటికీ ఇంకా అధికారులు స్పందించడం లేదు. వరదలు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి కూడా వచ్చారు. దెబ్బతిన్న వాటిని బాగు చేయిస్తామని హామీ ఇచ్చారు. కానీ, ఇంత వరకు ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. డ్రైనేజీల్లో పూడిక తీయాలి. రోడ్లపైకి నీరు రాకుండా చేయాలి. సీం పర్యటనకే దాదాపు రూ.2కోట్లు ఖర్చు చేసి ఉంటారు. ఆ డబ్బును మా కాలనీలను బాగు చేసేందుకు ఉపయోగించినా ప్రజలు ముంపు భయం లేకుండా ఉండేవారు. రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకొని ఇకనైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం"

**గత పరిస్థితులు పునరావృతం కావొద్దు**

కాలనీలో వరద ముంపు నివారణ చర్యలకు రూ.27 కోట్లతో పురపాలకశాఖ ప్రతిపాదనలు రూపొందించింది. గతేడాది సెప్టెంబర్‌లో రూ.కోటి నిధులు మంజూరు కాగా, అవి గుంతలను పూడ్చి, రోడ్లను పునరుద్ధరించడానికే సరిపోయాయి. జనావాసాల్లో ప్రధానమైన మురుగు కాల్వలను శుభ్రం చేసే పనులు అక్కడే ఆగిపోయాయి. అధిక వర్షాలు కురిసే లోపే వరద నివారణ చర్యలు చేపట్టాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గతేడాది ఎదుర్కొన్న సమస్యలు పునరావృతం కాకుండా తమకు వరద ముంపు నుంచి శాశ్వత పరిష్కారం కావాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం

-మొదటిపేజీ తరువాయి

వివరించేవిధంగా నెక్లెస్‌రోడ్డులో 'మూసీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్' ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడే మూసీ ప్రాజెక్టుపై ప్రజల అభిప్రాయాల్ని స్వీకరించాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఉన్నతాధికారులు నర్సింహారెడ్డి, గౌతమి, సర్ఫరాజ్ అహ్మద్, మాణిక్‌రాజ్ పాల్గొన్నారు.

**భూముల బదలాయింపు ప్రక్రియే కీలకం**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది సుందరీకరణ, పునరుజ్జీవన ప్రాజెక్టు అభివృద్ధి పనుల్లో మరో కీలక ముందడుగు పడిన విషయం తెలిసిందే. హైదరాబాద్? నగరంలోని బాపుఘాట్ వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న 'గాంధీ సరోవర్ ప్రాజెక్ట్?' కోసం 83 ఎకరాల భూమిలివ్వడానికి రక్షణశాఖ ఇటీవలే అంగీకరించింది. గోల్కొండ ఆర్టిలరీ పరిధిలోని రూ.533 కోట్ల విలువైన భూముల బదలాయింపు ప్రక్రియకు ఓకే చెప్పింది. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్?నాథ్? సింగ్, భారత ఆర్మీకి ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భూముల బదలాయింపు కీలక మైలు రాయి అని ఆయన అభివర్ణించారు. మూసీనదిని నిరంతరం మంచినీటి ప్రవాహంతో ఉండేవిధంగా పునరుజ్జీవం కల్పించడంతో పాటు నది పరీవాహక ప్రాంతాన్ని సంపద సృష్టించే ఆర్థిక నడవాగా, పర్యావరణ, సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రేవంత్‌రెడ్డి పేర్కొన్న విషయం తెలిసిందే.

**పచ్చజెండా ఊపిన రక్షణశాఖ**

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన మొదటి దశ మూసీ పునరుజ్జీవ పనుల్లో గాంధీ సరోవర్ ప్రాజెక్టు ముఖ్యమైనది. బాపూఘాట్ త్రివేణి సంగమం వద్ద 200 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని సర్కారు నిర్ణయం తీసుకుంది. అందుకోసం ప్రైవేటు భూములతో పాటు గోల్కొండ ఆర్టిలరీ సెంటర్? సంబంధించిన భూములు కూడా అవసరమయ్యాయి. భూ సేకరణకు ఒప్పించేందుకు సీఎం రేవంత్?రెడ్డి పలు దఫాలుగా రక్షణశాఖతో సంప్రదింపులను కూడా జరిపారు. మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ (ఎంఆర్?డీసీఎల్?) కూడా రక్షణ శాఖకు దీనిపై లేఖలు రాసింది. దీనికి స్పందించిన రక్షణశాఖ ఈ సంవత్సరం మార్చిలో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో గాంధీ సరోవర్? కోసం తెలంగాణ సర్కారు కోరుతున్న భూములను పరిశీలించారు. ఆ సమయంలోనే ప్రభుత్వం అడిగిన 83.814 ఎకరాలకు ఇవ్వడానికి రక్షణశాఖ పచ్చజెండాను ఊపింది.

## వీబీజీ రామ్‌జీ చట్టాన్ని అంగీకరించేది లేదు

-మొదటిపేజీ తరువాయి

వీబీ-జీ రామ్‌జీ చట్టంపై ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ ప్రజాసంఘాల ప్రతినిధులతో సచివాలయంలో సమావేశమైంది. మంత్రి సీతక్క సమావేశానికి హాజరుకాగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

**కర్ణాటక, కేరళం ముఖ్యమంత్రులను సంప్రదించి**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ రాష్ట్రాల అధికారాలను హరిస్తున్న వీబీ-జీ రామ్ జీ చట్టం సమాఖ్య స్ఫూర్తిపై జరుగుతున్న ప్రత్యక్ష దాడిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి అభివర్ణించారు. గ్రామీణాభివృద్ధిపై రాష్ట్రాల పాత్రను నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతోనే కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొస్తోందని మంత్రి ఆరోపించారు. కర్ణాటక, కేరళం ముఖ్యమంత్రులను సంప్రదించి ఉమ్మడి న్యాయపరమైన, రాజకీయ కార్యాచరణ ఖరారు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించినట్లు ఉత్తమ్ వెల్లడించారు.

**200 రోజుల హామీ ఉపాధి కల్పించాలి**

తెలంగాణ రాష్ట్రం సొంతంగా ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావాలని సమావేశంలో పాల్గొన్న దాదాపు 20 పౌరసంఘాలు సూచించాయని మంత్రి తెలిపారు. అరవై రోజుల ఉపాధి పరిమితిని పూర్తిగా వ్యతిరేకిస్తూ ప్రతీ గ్రామీణ కుటుంబానికి కనీసం 200 రోజుల హామీ ఉపాధి కల్పించాలని, చట్టబద్ధ కనీస వేతనాలు చెల్లించాలని పౌరసంఘాలు కోరుతున్నాయని తెలిపారు. కేంద్రం ప్రతిపాదించిన 60:40 నిధుల భాగస్వామ్యం తెలంగాణపై వేల కోట్ల రూపాయల అదనపు భారం మోపే ప్రమాదం ఉందని, ఈ అంశాన్ని రాష్ట్ర న్యాయశాఖ క్షుణ్ణంగా పరిశీలిస్తోందన్నారు. పనితీరు బాగున్న రాష్ట్రాలను శిక్షిస్తూ, వెనుకబడిన రాష్ట్రాలను ప్రోత్సహించేలా కేంద్రం రూపొందించిన నిధుల కేటాయింపు విధానం అన్యాయమని మంత్రి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి సమగ్ర సూచనలు పంపినప్పటికీ, వాటిని పూర్తిగా విస్మరించడం బాధాకరమని అన్నారు. సమావేశంలో పంచాయతీ రాజ్ ప్రత్యేక కార్యదర్శి దానకిశోర్, పంచాయతీ రాజ్ కమిషనర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో తెలంగాణకు స్థలం కరువు

**హైదరాబాద్ :** దేశ రాజధానిలో తెలంగాణకు కేరాఫ్ లేకుండా పోతోందా? ప్రస్తుతం ఏపీ మంచితనం మీద ఆధారపడాల్సి వస్తోందా? వాళ్ళు ఎప్పుడు ఖాళీ చేయమంటారోనని తెలంగాణ అధికారులు కంగారు పడుతున్నారా? ఏ విషయంలో అంత టెన్షన్ పడుతున్నారు? రాష్ట్ర విభజన జరిగిన 12 ఏళ్ళ తర్వాత కూడా ఆ సమస్యలు ఎందుకు వస్తున్నాయి? ఢిల్లీలో తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకకు నిర్మాణానికి అడ్డుపడుతున్నదేంటి? ఢిల్లీలో తెలుగోళ్ళకు కేరాఫ్ ఆంధ్ర భవన్. సెంట్రల్ ఢిల్లీలో అదీ, ఇండియా గేట్‌కు అత్యంత దగ్గరగా ఉన్న ఈ బిల్డింగ్ ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఓ వెలుగు వెలిగింది. అయితే విభజన తర్వాత ఆస్తుల పంపకాల్లో భాగంగా ఆంధ్ర భవన్ ను తాత్కాలికంగా విడగొట్టుకుని ఒకే బిల్డింగ్‌లో రెండు రాష్ట్రాలు అడ్మినిస్ట్రేషన్‌ను కొనసాగిస్తున్నాయి. అందుకే ప్రస్తుతం ఢిల్లీలోని ఈ భవన్‌ను చూస్తే గమ్మత్తుగా కనిపిస్తోందని అంటుంటారు చాలామంది. దీనికి ఒకవైపు ఆంధ్ర , మరో వైపు తెలంగాణ అని పక్క పక్కనే బోర్డ్స్ కనిపిస్తూ ఉంటాయి. పైగా రెండు రాష్ట్రాల ఢిల్లీ భవన్స్ ఒకే బిల్డింగ్‌లో ఉండడంతో వాళ్ళని వీళ్లు, వీళ్లని వాళ్ళు? మెయింటెనెన్స్‌ను పూర్తిగా గాలికొదిలేశారు. దాంతో ఘనంగా చెప్పుకోవాల్సిన ఆంధ్ర, తెలంగాణ భవన్లు ప్రస్తుతం గందరగోళంగా కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో సెక్రటేరియెట్‌కు ఎంతటి ప్రాముఖ్యత ఉంటుందో, ఢిల్లీలో ఉండే రాష్ట్రాల భవన్లకు అంత ఇంపార్టెన్స్ ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వారధిలా? ఢిల్లీలో రెసిడెంట్ కమిషనర్లు, ప్రోటో కాల్ అధికారులు ఉంటారు. ముఖ్యమంత్రి, చీఫ్ సెక్రటరీ, ఉన్నతాధికారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సైతం ఢిల్లీ ట్రిప్‌కు వచ్చినప్పుడు భవన్లోనే బస చేస్తూ ఉంటారు. ఈ క్రమంలో?. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక, భవన్ విభజనపై క్లారిటీ వచ్చింది, పంపకాలు జరిగాయి. ప్రస్తుతం ఉన్న బిల్డింగ్ మొత్తం ఆంధ్ర వాటా కింద వెళ్ళింది. ఆ ఒప్పందం ప్రకారం పటౌడీ హౌజ్‌లో ఉన్న ఖాళీ స్థలంలో తెలంగాణ భవన్ నిర్మాణం జరగాలి.కానీ? నిర్మాణం ఆలస్యం అవుతూ వస్తోంది. నిజం చెప్పాలంటే ప్రస్తుతం ఆంధ్ర భవన్‌లోనే తెలంగాణ భవన్ కొనసాగుతోంది. ఇది ఇలాగే ఉంటే ఏదో ఒకరోజున ఆంధ్ర వాళ్ళు ఖాళీ చేసి పొమ్మంటే మా పరిస్థితి ఏంటంటూ తెలంగాణ అధికారులు టెన్షన్ పడుతున్నారట. ఢిల్లీ భవన్ విభజన తర్వాత ఏపీకి 11.5 ఎకరాలు, తెలంగాణకు 8.2 ఎకరాలను కేటాయించారు, విభజన ప్రక్రియ మొత్తం కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో జరిగింది. ప్రస్తుతం ఢిల్లీలో తెలుగు రాష్ట్రాలకు ఉన్న స్థలం 19.7 ఎకరాలు. దాని విలువ 9వేల 913.505 కోట్లు ఉంటుంది. ఇది కూడా కేంద్ర హోంశాఖ చెప్పిన లెక్కే. వాస్తవానికి ఢిల్లీలో బహుళ అంతస్తుల నిర్మాణం కట్టాలంటే ప్రాసెస్ చాలా పెద్దది. మొదట ప్లాన్ రెడీ చేసి అనుమతులను కేంద్రం నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. దాని ప్రకారం ఇప్పటికే ప్లాన్ సిద్ధం చేసుకున్న తెలంగాణ సర్కార్ నిధులు కేటాయించి.. నిర్మాణం కోసం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కానీ? ఆ విషయంలో ఆలస్యం అవుతోంది. దాంతో? దేశ రాజధానిలో రాష్ట్రానికి కేరాఫ్‌గా నిలవాల్సిన భవనం లేకపోవడం ఇబ్బందిగా మారుతోంది. రాష్ట్రం నుంచి వచ్చే రాజకీయ నాయకులకు, అధికారులకు , సామాన్యులకు , టూరిస్టులకు కూడా ఇబ్బంది కలుగుతోంది.. మరోపక్క ఏపీ ప్రభుత్వం మాత్రం తన వాటాలోని 11.5 ఎకరాల్లో రూ.124.5 కోట్లతో కొత్త ఏపీ భవన్ నిర్మాణానికి సిద్ధమవుతోంది. అందుకోసం ఏపీ కేబినెట్ పచ్చజెండా ఊపింది కూడా. వాళ్ళు వెళ్ళిపొమ్మని ఖాళీ చేయించే పరిస్థితి రాకముందే తెలంగాణ భవన్‌కు పునాదులు వెయ్యాలని కోరుకుంటున్నారు ఇక్కడి అధికారులు.


నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం
28 జూన్ 2026

# సంపాదకీయం

## వాషింగ్ మెఃషిన్‌గా మారుతున్న అధికార పక్షం

ఎమర్జెన్సీని ప్రకటించి 51 సంవత్సరాలు గడిచినా, భారతదేశం తన ప్రజాస్వామ్య చరిత్రలోని అత్యంత వివాదాస్పద అధ్యాయాలలో ఒకదానిపై చర్చను కొనసాగిస్తోంది. ఆ చర్చ సమంజసమే కావచ్చు. ఎమర్జెన్సీ పరిశీలన, విమర్శ, చారిత్రక పరిశీలనకు అర్హమైనది. అయితే, ప్రజలు, చరిత్ర రెండూ ఎప్పుడో తీర్పు వెలువరించిన ఒక చారిత్రక సంఘటనగా కాకుండా, భారతీయ జనతా పార్టీ దీనిని ఒక సమకాలీన రాజకీయ సమస్యగా ఎందుకు పరిగణిస్తూనే ఉందనేది అంత సులభంగా అర్థం కాని విషయం. వాస్తవానికి, భారతదేశంలో ప్రజాస్వామ్యం ఇటీవల వెనకడుగు వేయడాన్ని పరిగణనలోకి తీసుకుంటే, అప్రకటిత ఎమర్జెన్సీని విధించింది బిజెపియే. రాజకీయ పార్టీలను విచ్ఛిన్నం చేయడం, ఫిరాయింపులను ప్రోత్సహించడం, మీడియా యాజమాన్యంలోని ఒక పెద్ద విభాగంపై ఉక్కుపిడికిలి బిగించడం, ఆశ్రితపెట్టుబడిదారీ విధానం, సంస్థల గొంతు నొక్కడం, కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలను దుర్వినియోగం చేయడం – ఇవన్నీ ఎమర్జెన్సీ లక్షణాలు, ఇవి ఇప్పటికీ అమలులో ఉన్నాయి. కాంగ్రెస్ సమకాలీకులలో చాలామంది కూడా, ఎమర్జెన్సీ గురించి లోతుగా పరిశోధించడానికి లేదా చర్చించడానికి తరచుగా ఇబ్బందిపడతారు. ఎమర్జెన్సీ దోషరహితమైనదని కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ వాదించలేదు. దశాబ్దాలుగా, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌లతో సహా దాని అగ్ర నాయకత్వం, ఆ కాలంలో జరిగిన దురాగతాలను బహిరంగంగా అంగీకరించింది. ఇందిరా గాంధీ స్వయంగా 1977లో ఎన్నికలు నిర్వహించి ప్రజల తీర్పును కోరారు. ఓడిపోయినప్పుడు ఓటర్ల తీర్పును అంగీకరించారు. ఆమె స్వయంగా మరో వేయేళ్లు వరకు దేశంలో ఎమర్జెన్సీ విధించే పరిస్థితి రాదనీ చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ నాయకత్వం చరిత్రలోని ఆ అధ్యాయం పట్ల పదేపదే విచారం వ్యక్తం చేసింది. అయినప్పటికీ, ప్రతి సంవత్సరం, ముఖ్యంగా జూన్ 25వ తేదీ చుట్టూ, బిజెపి ఎమర్జెన్సీని ఒక రాజకీయ ఆయుధంగా పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తుంది. దీని ఉద్దేశం చారిత్రక పరిశీలన కాదు. ఇది ఒక రాజకీయ సమీకరణ.తన వర్తమానంపై విశ్వాసం ఉన్న ప్రభుత్వం, తన పరిపాలన ద్వారా ప్రజల మెప్పు పొందగలమని ఆత్మవిశ్వాసం గల ప్రభుత్వం, దాదాపు అర్ధ శతాబ్దం క్రితం ఉనికిలో లేకుండాపోయిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరంతరం ప్రచారం చేయవలసిన అవసరం ఉండదు. పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వం మారగానే ఇటీవల కోల్‌కతా అంతటా జరిగిన కూల్చివేతల పరంపర ఎమెర్జెన్సీ నాటి దారుణమైన రోజులను గుర్తుకు తెచ్చింది. సీల్దా, హౌరా, దమ్ దమ్, జాదవ్‌పూర్, ఇతర ప్రాంతాలలో తోపుడు బండ్ల వ్యాపారులు, చిన్న వ్యాపారులు, విక్రయదారులు, మురికివాడల నివాసితుల జీవనోపాధిని నాశనం చేసింది. అధికారులు 'అభివృద్ధి', 'సుందరీకరణ' అని పిలిచేది, వాస్తవానికి, శ్రామిక కుటుంబాలు దశాబ్దాలుగా చెమటోడ్చి నిర్మించుకున్న ఇళ్లను, వ్యాపారాలను రాత్రికి రాత్రే కూల్చివేయడమే. మే 16– 17 తేదీల రాత్రి, రైల్వే అధికారులు, భద్రతా దళాలు అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద సీల్దా స్టేషన్‌లోని కియోస్కులు, స్టాల్స్‌ను కూల్చివేశారు. ఇదే తరహా చర్యలు మే 16న హౌరాలో, మే 31 రాత్రి దమ్ దమ్ జంక్షన్‌లో, జూన్ 7– 8 తేదీల రాత్రి జాదవ్‌పూర్‌లో జరిగాయి. జాదవ్‌పూర్‌లో, వీధి వ్యాపారులు, విద్యార్థులు, కార్మిక సంఘాల కార్యకర్తలు బుల్డోజర్ల ముందు శాంతియుతంగా కూర్చున్నప్పుడు, వారిపై లాఠీచార్జీలు,అరెస్టులు జరిగాయి. వృద్ధ వీధి వ్యాపారులు తమ జీవితపు ఆనవాళ్ల కోసం శిథిలాలలో వెతుక్కోవాల్సి వచ్చింది. కార్మికులకు సంఘీభావం తెలిపినందుకు విద్యార్థులు, కార్యకర్తలను కొట్టారు. ప్రభావిత వర్గాలు చర్చలకు వెళ్ళినప్పుడు, వారిని పట్టించుకోలేదు. వారి డిమాండ్ చాలా సరళమైనది:ఉత్తరప్రదేశ్ నుండి మధ్యప్రదేశ్ మీదుగా రాజస్థాన్ వరకు, కూల్చివేత చర్యలను పట్టణ ప్రణాళిక సాధనాలుగా కాకుండా, ప్రభుత్వ ఆధిపత్య ప్రదర్శనలుగా ప్రయోగించారు. ఇవి ప్రధానంగా శ్రామిక పేదలు, వలస కార్మికులు, అసంఘటిత కార్మికులను (తరచుగా మైనారిటీలు) లక్ష్యంగా చేసుకున్నాయి. వీరికి ప్రతిఘటించడానికి అతి తక్కువ వనరులు, అతి తక్కువ రాజకీయ రక్షణ ఉంటాయి. ప్రయోగించిన ప్రతి బుల్డోజర్‌తో, తాను పనికిరానివారిగా భావించిన వారిపై బలాన్ని ప్రయోగించడానికి సిద్ధంగా ఉన్నానని బిజెపి తన 'బేస్'కు సంకేతం ఇస్తుంది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా ఒక వర్గం వారి ఇల్లు లేదా జీవనోపాధి రాత్రికి రాత్రే తుడిచిపెట్టుకుపోయిన ప్రతిసారీ ప్రజాస్వామ్య జవాబుదారీతనం క్షీణిస్తుంది. గత ఐదేళ్లలో భారతదేశవ్యాప్తంగా కూల్చివేతలు 379% పెరిగాయని పరిశోధనా సంస్థలు నమోదు చేశాయి. నేడు అధికార కేంద్రీకరణ శృతిమించిపోతుంది. ప్రజాస్వామ్యంలో నిరసనలు, భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడం కీలకం. అయితే, కీలక నిర్ణయాల విషయంలో సహితం మంత్రివర్గంలో కూడా సవివరంగా చర్చలు ఉండటం లేదు. అధికార పక్షం 'వాషింగ్ మెషిన్'గా మారిపోయింది. ఈ మొత్తం ప్రక్రియ ప్రజాస్వామ్యాన్ని పరిహాసం కావించడమే కాగలదు. ఎమెర్జెన్సీలో మాదిరిగా న్యాయవ్యవస్థ సైతం నిస్సహాయంగా

# స్టాక్ మార్కెట్‌లో మస్క్ ప్రభంజనం!




స్పేస్‌ఎక్స్ షేర్లు మార్కెట్లోకి వచ్చిన వెంటనే ఆ సంస్థ విలువ 2 ట్రిలియన్ డాలర్లు దాటింది. దాంతో ఆ కంపెనీ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ వ్యక్తిగత సంపద కూడా సరికొత్త శిఖరాలను తాకి, అ తను ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా అవతరించాడు. ట్రిలియన్ అంటే సుమారు 94 లక్షల కోట్ల రూపాయలు. అది 2025–26 సంవత్సరానికి భారతదేశ స్థూల దేశీయోత్పత్తిలో దాదాపు నాలుగో వంతు. లేదా, భారతదేశ అత్యంత సంపన్నుడు ముఖేష్ అంబానీ సంపదకు దాదాపు పది రెట్లు. మస్క్ సంపద ఆ స్థాయికి పెరుగడానికి కారణమైన స్పేస్ ఎక్స్ అసాధారణ మార్కెట్ విలువపై ప్రపంచవ్యాప్తంగా విశ్లేషకులు మల్లగుల్లాలు పడుతున్నారు. మార్కెట్ ఆపాదిస్తున్న విలువ ఆ కంపెనీ వాస్తవ స్థితిగతులను ప్రతిఫలిస్తున్నదా? లేక స్టాక్ మార్కెట్లలో తరచుగా కనిపించే అత్యుత్సాహానికి ఇది మరో ఉదాహరణ మాత్రమేనా? స్పేస్ ఎక్స్ సంస్థను మరో సాధారణ టెక్నాలజీ కంపెనీగానో లేదా రాకెట్లు ప్రయోగించే అనేక అమెరికా సంస్థల్లో ఒకటిగానో చూస్తే దాని విలువ అసంబద్ధంగానే అనిపిస్తుంది. కానీ, ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ గతంలో టెస్లా, పేపాల్, న్యూరాలింక్ వంటి దిగ్గజ బ్రాండ్ల ద్వారా సాధించిన విజయాలను, కంపెనీ దీర్ఘకాలిక ప్రణాళికలను పరిశీలిస్తే ఆర్థిక విపణులు ఆ కంపెనీకి ఎందుకు ఇంతటి విలువను ఆపాదిస్తున్నాయో కొంతవరకు స్పష్టమవుతుంది. ముఖ్యంగా, ఇటీవలి వరకు మన ఊహలకు కూడా అందని కొన్ని వ్యాపార అవకాశాలపై స్పేస్‌ఎక్స్ దృష్టి సారించడం పెట్టుబడిదారులను విశేషంగా ఆకర్షిస్తున్నది. గతంలో అంతరిక్ష ప్రయోగాలు అత్యంత ఖరీదైనవిగా ఉండేవి. వందల కోట్ల రూపాయలు ఖర్చుచేసి ప్రయోగించిన రాకెట్, పని పూర్తయిన తర్వాత వృథాగా సముద్రంలో పడిపోయేది. తదుపరి ప్రయోగానికి మరో రాకెట్ నిర్మించాల్సి రావడంతో, ప్రభుత్వాలు, విశేష వనరులు కలిగిన కొన్ని బహుళజాతి సంస్థలకే అంతరిక్ష ప్రయోగాలు పరిమితమయ్యేవి. ఆ రంగం వ్యాపార స్వభావాన్ని స్పేస్‌ఎక్స్ పూర్తిగా మార్చేసింది. ప్రయోగం ముగిసిన తర్వాత రాకెట్‌ను తిరిగి భూమిపైకి దించి, దానిని పునర్వినియోగించే సాంకేతికతను విజయవంతంగా అమలు చేయడంతో ప్రయోగ వ్యయం గణనీయంగా తగ్గింది. ఫలితంగా ఉపగ్రహాల ప్రయోగం ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. వాణిజ్య అంతరిక్ష ప్రయోగాల మార్కెట్లో స్పేస్‌ఎక్స్ దాదాపు 80 శాతం వాటాను కైవసం చేసుకున్నది. స్పేస్‌ఎక్స్ విలువకు కారణం రాకెట్ వ్యాపారం మాత్రమే కాదు. ఆ సంస్థ భవిష్యత్తు ఆదాయాల్లో సింహభాగం, స్పేస్ ఎక్స్ అంతర్భాగమైన స్టార్ లింక్ నుంచి రావచ్చని విశ్లేషకుల అంచనా. వేలాది ఉపగ్రహాలను భూ కక్ష్యలో ప్రవేశపెట్టి, ప్రపంచవ్యాప్తంగా సముద్రాలు, ఎడారులు, కొండ ప్రాంతాలు, గగనతలం, ధృవ ప్రాంతాలు, యుద్ధ ప్రభావిత ప్రాంతాలు –– ఇలా సంప్రదాయ టెలికాం నెట్‌వర్క్‌లు చేరుకోలేని మారుమూలలకు కూడా ఇంటర్నెట్ సేవలు విస్తరించాలన్నది స్టార్ లింక్ లక్ష్యం. ఈ బృహత్తర ప్రణాళిక విజయవంతమైతే, స్టార్ లింక్ కేవలం మరో టెలికాం సంస్థగా కాకుండా –– భౌగోళిక సంక్లిష్టతలకు అతీతంగా ప్రపంచ స్థాయి డిజిటల్ మౌలిక సదుపాయాలు సమకూర్చే వ్యవస్థగా పరిణితి చెందే అవకాశం ఉన్నది. స్పేస్‌ఎక్స్ మార్కెట్ విలువలో, భవిష్యత్ ఆదాయ అవకాశాలు చెప్పుకోదగ్గ స్థాయిలో ప్రతిబింబిస్తున్నా యనే వాదనను తోసిపుచ్చలేం. ఉత్తరోత్తరా అవకాశాలు మెండుగా ఉన్న టెక్నాలజీ కంపెనీల విషయంలో ఇది అసాధారణం కాదు. అటువంటి కంపెనీల షేర్ల ధరలను మదింపు చేసేటప్పుడు, ప్రస్తుత ఆదాయాల కంటే భవిష్యత్తు ఆదాయాల ఆధారంగా చేసే లెక్కలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి న్యూయార్క్‌కు వెళ్లాలంటే, ఎంచుకున్న మార్గాన్ని బట్టి 15 నుంచి 20 గంటలు పడుతుంది. ఆ సుదీర్ఘ ప్రయాణానికి అధికమొత్తంలో ఇంధనం ఖర్చవుతుంది. కానీ మస్క్ ఎప్పట్నుంచో కలలు కంటున్న వ్యోమనౌక ఆధారిత ప్రయాణ వ్యవస్థ విజయవంతమైతే, అదే ప్రయాణం గంటలోపే పూర్తయ్యే రోజులు రావచ్చని విశ్లేషకుల ఆశాభావం. ప్రస్తుతం ఇది ఇంకా ఆలోచన దశలోనే ఉన్నది. కానీ కార్యరూపం దాల్చితే, విమానయాన రంగం స్వరూప స్వభావాలు పూర్తిగా మారిపోయే అవకాశం ఉన్నది. అందుకే స్పేస్‌ఎక్స్ భవిష్యత్తు అవకాశాల గురించి మాట్లాడేటప్పుడు ఈ రంగాన్ని కూడా మార్కెట్ వర్గాలు ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నాయి. అంతరిక్షానికి చేరుకొనే వ్యయం గణనీయంగా తగ్గుతుండటంతో, ఇప్పటివరకు దాదాపు ప్రభుత్వాలకే పరిమితమైన ఈ రంగంలో ముందు ముందు ప్రైవేట్ రంగ భాగస్వామ్యం కూడా గణనీయంగా పెరుగుతుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఆధునిక యుద్ధాల్లో ఉపగ్రహ కమ్యూనికేషన్లు, నిఘా వ్యవస్థలు, సురక్షిత డాటా నెట్వర్కులు అత్యంత కీలకంగా మారాయి. ఇంకా పూర్తిగా సమసిపోని ఐరోపా, పశ్చిమాసియాల్లో ఉద్రిక్తతలు ఈ వ్యవస్థల ప్రాధాన్యాన్ని మరింత స్పష్టంగా చూపిస్తున్నాయి. అందువల్ల అంతరిక్షం, జాతీయ భద్రతకు సంబంధించిన వ్యూహాత్మక రంగంగా కూడా వేగంగా రూపుదిద్దుకుంటున్నది. ఈ కారణంగానే అనేక ప్రభుత్వాల రక్షణ, గూఢచార్య విభాగాలు కూడా అంతరిక్ష పరిశోధనా రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతు న్నాయి. అయితే ఈ అంచనాలన్నీ ఏ మేరకు కార్యరూపం దాల్చుతాయో కాలమే నిర్ణయిస్తుంది. స్పేస్‌ఎక్స్ కు మార్కెట్ ఆపాదిస్తున్న అపారమైన విలువను అర్థం చేసుకోవాలంటే –– దాని ప్రస్తుత కార్యకలాపాలను మాత్రమే కాకుండా, అది లక్ష్యంగా పెట్టుకున్న భవిష్యత్ రంగాలలో రోజురోజుకూ పెరుగుతున్న అవకాశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. విలువ విషయాన్ని పక్కన పెడితే, అంతరిక్షం క్రమంగా ఆర్థిక కార్యకలాపాల వేదికగా రూపుదిద్దుకుంటు న్నదని, ఆ అవకాశాలను అందిపుచ్చు కోవడంలో స్పేస్‌ఎక్స్ ముందంజలో ఉందన్నది మాత్రం వాస్తవం. భారత యువత ఈ పరిణామాన్ని కేవలం ఎలాన్ మస్క్ సంపదకు సంబంధించిన అంశంగా పరిగణిస్తే విలువైన పాఠాన్ని కోల్పోతుంది. మరుగున పడి ఉన్న అవకాశాలను ముందుగానే గుర్తించి, మేథోమథనం ద్వారా వాటిని వ్యాపారాలుగా మలచినవారినే సంపద వరిస్తుందని గుర్తించాలి. నిన్నటి అవకాశం సాఫ్ట్‌వేర్‌లో ఉంటే, నేడు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ముందంజలో ఉన్నది. భవిష్యత్తు అంతరిక్షం, హరిత ఇంధనం లేదా జీవసాంకేతిక రంగంతో ముడిపడి ఉండవచ్చు. మిణుకు మిణుకు మంటున్న సంకేతాలను ముందుగా పసిగట్టిన వారే రాబోయే అవకాశాలను అందిపుచ్చుకుంటారు.

# పాస్‌పోర్టూ పనికిరాదా?




ప్రపంచంలో ఏ దేశం పాస్‌పోర్టు శక్తిమంతమైందో లెక్కేసిచెప్పే హెన్లే పాస్‌పోర్టు ఇండెక్స్ (హెచ్‌పీఐ)... మన పాస్‌పోర్టు 75వ స్థానంలో ఉందంటూ ఈ ఏడాది మొదట్లో నిర్ధారించింది. 'హమ్మయ్య... నిరుటితో పోలిస్తే పదిమెట్లు పైకొచ్చాం' అని మన పౌరులు గర్వపడి ఆర్నెల్లు కాకుండానే దానికేమీ పెద్దగా విలువలేదనీ, భారత పౌరసత్వానికి అదేమీ రుజువు కాబోదనీ మన విదేశాంగ శాఖ తేల్చిచెప్పి, ఆ సంతోషంపై నీళ్లు చల్లింది. 'ఇది ఇప్పుడు తీసుకున్న నిర్ణయం కాదు... గత పుష్కరకాలంలోని నిర్ణయం కానేకాదు. 1967 నాటి పాస్‌పోర్టు చట్టమే ఆ మాట చెప్పిం'దని సెలవిస్తోంది. గత కాలపు నిర్ణయం అయినంత మాత్రాన ఏదైనా శిరోధార్యమవుతుందా... దాన్ని సమీక్షించటం, మార్చటం అసాధ్యమా అన్న ప్రశ్నలు సహజంగానే అందరిలో తలెత్తుతున్నాయి. ఈమధ్యకాలంలో ఎన్నికల సంఘం (ఈసీ) ధర్మమా అని పౌరసత్వంపై ప్రజానీకంలో ఆందోళన బయల్దేరింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) పేరిట బిహార్‌లో మొదలై పలు రాష్ట్రాల్లో సాగిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కావలసినంత కలవరపాటును సృష్టించింది. ఇంకా సృష్టిస్తోంది. పౌరులమని నిరూపించుకునే పత్రాలు సమర్పిస్తేనే ఓటు ఉంటుందనటంవల్ల పలు రాష్ట్రాల్లో లక్షల సంఖ్యలో పౌరులు ఓటుహక్కు కోల్పోయారు. యూపీలో అలాంటివారు రెండు కోట్ల పైమాటే. వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆగిపోవటం తక్షణ ప్రమాదమైతే... దేశంలో నివసించటం అసాధ్యమయ్యే స్థితి ఏర్పడటం ముమ్మందు ఎదురయ్యే ముప్పు. ఈ దేశ పౌరులని ఈసీ నమ్మితేనే ఎవరికైనా ఓటుహక్కు లభిస్తుంది. అలాగని ఓటర్ గుర్తింపు కార్డు పౌరసత్వానికి రుజువు కాబోదని ప్రభుత్వమే చెబుతోంది. ఇప్పుడు పాస్‌పోర్టు సైతం ఆ ఖాతాలో చేరింది. పదిహేనేళ్ల క్రితం మహారాష్ట్రలోని తెంబ్లీలో ఆధార్‌ను లాంఛనంగా ప్రారంభించి నప్పుడు నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆ కార్డే ఇకపై సర్వస్వమనీ, దాని ఆధారంగానే పథకాల వర్తింపు అయినా, పౌరుల గుర్తింపయినా వుంటుందనీ అన్నారు. నిరుపేదలకు ఏ గుర్తింపు కార్డూ లేకపోవటాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ ప్రాజెక్టు ప్రారంభించామని కూడా చెప్పారు. తీరా సర్ ప్రక్రియ సమయంలో అది చెల్లుబాటు కాబోదని ఈసీ తేల్చి చెప్పింది. అటుపై సుప్రీంకోర్టు అనుమతించిన 12 పత్రాల్లో పాస్‌పోర్టు కూడా ఉండటం చాలామందికి ఊరటనిచ్చింది. ఇప్పుడు పాస్‌పోర్టు కూడా పౌరసత్వాన్ని నిర్ధారించటానికి పనికిరాదనటం సహజంగానే ఆందోళన కలిగిస్తుంది.

అవధానాల్లో ఆశువుగా పద్యం చెప్పే అవధానికి 'నిషిద్ధాక్షరి' మాటున పృచ్ఛకుడు అడుగడుగునా అడ్డుతగులుతూ, ప్రతి పదంలోనూ అక్షరాలను నిషేధిస్తూ ముప్పు తిప్పలు పెడతాడు. వీటన్నిటినీ అధిగమించి ఛందోబద్ధంగా అందమైన పద్యాన్ని అల్లటం అవధాని పద సంపదకు పరీక్ష. పౌరసత్వం విషయంలో దేశ పౌరులకు ఇలాంటి పరీక్షే ఎదురవుతోంది. ఏ పత్రం దాఖలు చేద్దామనుకున్నా అది పనికిరాదని చెప్పటం తప్ప, పనికొచ్చేదేమిటో పాలకులు నిర్ధారణగా చెప్పరు. ఇందువల్ల సామాన్యుల్లో అభద్రతా భావన ఏర్పడటం తప్ప సాధిస్తున్నదేమిటి? పాస్‌పోర్టు చట్టం సెక్షన్ 6(2)(ఏ) ఈ దేశ పౌరుడుకాని వ్యక్తికి పాస్‌పోర్టు నిరాకరించాలని స్పష్టంగా చెబుతోంది. ప్రభుత్వం జారీ చేసే పాస్‌పోర్టే వేరే దేశాలకు ప్రమాణం. దాన్నిబట్టే వీసాలు జారీ అవుతాయి. అది పనికిరాదంటే ఆ దేశాలు అడుగుపెట్టనిస్తాయా? హెచ్‌పీఐ ర్యాంకులు సాధారణమైనవేం కాదు. ప్రపంచంలో సింగపూర్ పాస్‌పోర్టును మొత్తం 192 దేశాలు గుర్తించి, వీసా అవసరం లేకుండానే తమ భూభాగాల్లో అడుగు పెట్టేందుకు అనుమతిస్తున్నాయి. అందువల్లే అది ప్రథమ స్థానంలో ఉంది. 187 దేశాల గుర్తింపుతో జపాన్, దక్షిణ కొరియాలు... 186 దేశాల గుర్తింపుతో స్వీడన్, యూఏఈలు 2, 3 స్థానాల్లో ఉన్నాయి. అలా చూస్తే మన పాస్‌పోర్టుకు 56 దేశాల గుర్తింపు మాత్రమే ఉంది. ఇతరచోట్లకు వెళ్లాలంటే వీసా కావాలి. వారు సైతం పాస్‌పోర్టు ఆధారంగానే వీసా జారీచేస్తారు. ఇప్పుడు విదేశాంగశాఖ తకరారుతో అంతర్జాతీయంగా ఎవరైనా తలుపులు మూస్తే మన పౌరుల గతేమిటి? ఎన్నో దేశాల్లో అన్నిటికీ చెల్లుబాటయ్యే కార్డు జారీ విధానం దశాబ్దాల క్రితమే అమల్లోకొచ్చింది. మనం మాత్రం అభద్రతాభావంతో పౌరులకు అడుగడుగునా సమస్యలు సృష్టిస్తున్నాం. ఇది సబబేనా?

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం
28 జూన్ 2026

## మొగిలిపేట ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన సుజిత్ రావు

**పలు అభివృద్ధి పనులు ప్రారంభం**




**నవగీతం, జూన్27,మల్లాపూర్ ప్రతినిధి:** మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామంలో ప్రభుత్వ పాఠశాలని సందర్శించిన టీపీసీసీ డెలిగేట్ సుజిత్ రావు విద్యార్థుల కోరిక మేరకు వారికి టాయిలెట్లకు సెప్టిక్ ట్యాంక్,వంట చేయడానికి ఇబ్బంది పడుతున్న సందర్భంగా రేకుల షెడ్డు ను మరియు విద్యార్థులకు టై బెల్ట్ లను ,తన సొంత నిధులతో నిర్మిస్తానని హామీ ఇచ్చి పనులను తక్షణమే ప్రారంభించడం జరిగింది...ఈ కార్యక్రమంలో మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, రాష్ట్ర కిసాన్ సేల్ జాయింట్ కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి,పాఠశాల సిబ్బంది విడిసి చైర్మన్ జెల్ల ప్రసాద్,దేవాలయ కమిటీ సామ రవి,వార్డు సభ్యుడు దండవేణీ సోమరాజు,మాజీ ఉప సర్పంచ్ ఎన్నడ్ల రాములు,విడిసి సభ్యులు వంగ శ్రీనివాస్ రెడ్డి, మహబూబ్ ఖాన్,మొకు ప్రవీణ్,చిట్యాల శ్రీధర్,తోకల రాజు,బొల్లి నర్సయ్య ,బైండ్ల శ్రీకాంత్,మొగిలి రాజేందర్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు నాయకులు,గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

## తల్లాడలో ముగిసిన మొహర్రం వేడుకలు: భక్తిశ్రద్ధలతో పీర్ల భారీ ఊరేగింపు




**నవగీతం, జూన్27,తల్లాడ ప్రతినిధి** మండల కేంద్రమైన తల్లాడ పట్టణంలో మొహర్రం వేడుకలు శనివారం భారీ ఊరేగింపుతో అత్యంత వైభవంగా ముగిశాయి. మహమ్మద్ ప్రవక్త మనుమడైన ఇమామ్ హుస్సేన్, ఆయన కుటుంబ సభ్యులు యుద్ధంలో అసువులు బాసిన వీరమరణానికి, త్యాగానికి చిహ్నంగా ఈ సంతాప దినాలను భక్తులు భక్తిశ్రద్ధలతో పాటించారు. పండుగలో భాగంగా నిర్వహించిన ఏడవ షరగత్ ఉత్సవాల నుండి శనివారం 11వ రోజు ముగింపు వేడుకల వరకు పట్టణంలో పీర్ల సందడి, భక్తిభావం వెల్లివిరిశాయి.?మొహర్రం చివరి రోజును పురస్కరించుకొని పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, మరియు డిజే శబ్దాల నడుమ యువకుల నృత్యాలతో పీర్ల ఊరేగింపు ఘనంగా సాగింది. ముస్లిం సోదరులు పీర్లను చేతబూని భక్తిశ్రద్ధలతో సాగించిన ఈ ర్యాలీ వినాయక చౌక్, ప్రధాన కూడళ్ల మీదుగా సాగింది. అంతకుముందు పీర్ల చావిడి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హోమగుండం (అగ్ని గుండం) వద్ద భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు.??"హసన్, హుస్సేన్ల త్యాగాలను స్మరిస్తూ జరుపుకునే మొహర్రం పండుగ లౌకికత్వానికి, మత సామరస్యానికి నిలువెత్తు ప్రతీక. పీర్ల ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలి."--- షేక్ ఈసుఫ్ (పీర్ల ముజావర్)?ఈ సందర్భంగా భక్తులు పీర్ల చావిడి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి, సాంప్రదాయబద్ధంగా చాదర్లను సమర్పించారు.??సాంస్కృతిక సాంప్రదాయాల మహోత్సవంగా సాగిన ఈ ముగింపు వేడుకలలో ముజావర్ ఎస్ కే ఈసుఫ్ తో పాటు కమిటీ సభ్యులు, ప్రముఖులు అయిన నన్నేసా, అక్బర్, జానీ, ఖాసిం, నాగులు, మహారాజ్, చానా, సుభాని, యాసిన్, బాజీ మరియు పట్టణానికి చెందిన ముస్లిం సోదరులు, మహిళలు, చిన్నారులు, భక్తులు రికార్డు స్థాయిలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

## ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ పై గ్రామస్తులకు అవగాహన



**నవగీతం, జూన్27,. మల్లాపూర్ ప్రతినిధి:** మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో శనివారం ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమంలో భాగంగా బిఎల్వోలు ఓటర్ పత్రాలను ఇంటింటికి పంపిణీ చేసి ఓటర్ పత్రాలపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం ఓటరు జాబితాను తప్పులు లేకుండా రూపొందించడం ఎన్నికల సంఘం ప్రధాన బాధ్యత అని ఈ లక్ష్యంతో ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభమైందని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లకు ఫారాలు అందిస్తామని వారి మీ ఇంట్లో ఉన్న ఓటర్ల వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో ఒకసారి చూసుకోవడానికి ఒక వేదిక అని ఫామ్ వివరాలు రాసేటప్పుడు తప్పులు లేకుండా స్పష్టమైన అక్షరాలతో వ్రాయాలని వారు సూచించారు వారి సందేహాలను నివృత్తి చేస్తామని పొరపాట్లకు తావు లేకుండా నిబంధనల ప్రకారం పని చేస్తామని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో బిఎల్ఓ లావణ్య రెవెన్యూ ఇన్స్పెక్టర్ అశోక్ , విష్ణువర్ధన్ రాజు కస్తూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## బీజేవైఎం ఆధ్వర్యంలో నమో జెన్ జీ సమావేశం




**నవగీతం, జూన్27, జగిత్యాల :** భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో జగిత్యాల కేంద్రంలో ఎస్ వి ఎల్ ఆర్ ఫంక్షన్ హాల్ నమో జెన్ జీ సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి జిల్లా కన్వీనర్ ఇట్టెడి శేఖర్ రెడ్డి సభ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగాబీజేపీ జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు బీజేవైఎం స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు యాదగిరిబాబు మాట్లాడుతూ నరేంద్రమోడీ ప్రధానమంత్రి అయ్యాక దేశం ఈ 12 ఏళ్ళల్లో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ నాయకత్వంలో పసుపు బోర్డు, హైవేలు. ఆర్ ఓ బి,ఆర్ యూ బి లు, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నమో జెన్ జీ కో కన్వీనర్ పవన్,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.అనూప్ రావు ఎస్సి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్,నరేందర్ రెడ్డి గోపిడి,శ్రీనివాస్ రెడ్డి ,ముత్యం రెడ్డి ,వెంకటేష్,అశోక్, నూతనంగా ఎన్నికైన వివిధ మోర్చాల అధ్యక్షులు,యువమోర్చా కార్యకర్తలు పాల్గొన్నారు

## తండ్రి కలను సాకారం చేసిన తనయుడు.

అగ్నివీర్‌గా ఎంపికై గ్రామానికి గర్వకారణమైన గౌరుగొల్ల లోకేందర్......




**నవగీతం, జూన్27,మల్లాపూర్ ప్రతినిధి:** దేశానికి వెన్నుముక రైతు అయితే, దేశాన్ని కంటికి రెప్పలా కాపాడేది సైనికుడు. వీరిద్దరూ దేశానికి రెండు కళ్ల వంటివారు. దేశం పట్ల ప్రేమ ప్రతి భారతీయుడికీ ఉన్నప్పటికీ, దేశ రక్షణ కోసం జీవితాన్ని అంకితం చేసే అవకాశం కొందరికే దక్కుతుంది.అలాంటి అరుదైన అవకాశాన్ని సాధించి, తన తండ్రి గౌరుగొల్ల మల్లేష్ గారి కలను నిజం చేసిన యువకుడు గౌరుగొల్ల లోకేందర్. చిన్ననాటి నుంచే తల్లి సంధ్యారాణి దేశభక్తి భావాలను అతనిలో నాటగా, దేశ సేవే జీవిత లక్ష్యంగా ముందుకు సాగాడు.తన ప్రయాణంలో ఎదురైన ప్రతి సవాలును ధైర్యంగా ఎదుర్కొనేలా బాబాయి రాకేష్ అండగా నిలిచి, సరైన మార్గనిర్దేశం చేశారు. అలాగే నానమ్మ చిన్నూబాయి, పిన్ని రవళితో పాటు కుటుంబ సభ్యులందరూ ప్రతి దశలో ప్రోత్సాహాన్ని అందించారు.లోకేందర్ తన ప్రాథమిక విద్యను జేమ్స్ మోడల్ స్కూల్, రత్నాపూర్లో 1వ, 2వ తరగతులు చదివి, అనంతరం బ్రూక్లిన్ గ్రామర్ హై స్కూల్, మెట్‌పల్లిలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యను అభ్యసించాడు. ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలోనే డ్రీమ్స్ డిఫెన్స్ అకాడమీ, కరీంనగర్లో సైనిక శిక్షణ పొందుతూ, చదువును కూడా నిర్లక్ష్యం చేయకుండా విజయవంతంగా పూర్తి చేశాడు. అనంతరం వాణి నికేతన్ డిగ్రీ కళాశాలలో చేరి, అచంచలమైన సంకల్పంతో నిరంతర సాధన కొనసాగించాడు.తన కృషికి ప్రతిఫలంగా, డిగ్రీ రెండవ సంవత్సరంలోనే అతి చిన్న వయస్సులో లిఅగ్నివీర్ (భారత ఆర్మీ)లిలో ఎంపికై తన తండ్రి కలను సాకారం చేశాడు. తండ్రికి తగ్గ తనయుడిగా నిలవడమే కాకుండా, తన స్వగ్రామమైన కుస్తాపూర్ యువతకు స్ఫూర్తిగా నిలిచాడు.దేశ సేవకు అంకితమైన లోకేందర్ మరెన్నో విజయాలు సాధించి, భారత మాతకు మరింత గొప్ప సేవ చేయాలని గ్రామ ప్రజలు, మిత్రులు, కుటుంబ సభ్యులు ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు.

## సెర్ప్ ఆధ్వర్యంలో ఘనంగా "హెలెన్ కెల్లర్" జయంతి వేడుకలు




**నవగీతం, జూన్27, జగిత్యాల:** అమెరికా లోని అంబామా రాష్ట్రం లో జన్మించి, చిన్న తనం లోనే తీవ్రమైన జ్వరం తో చూపు, వినికిడి మరియు మాటలు లేకపోయి, అపారమైన ఆత్మవిశ్వసంతో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన స్ఫూర్తిదాయకమైన హెలన్ కెల్లార్ జయంతి సందర్బంగా జగిత్యాల జిల్లా కేంద్రశీ లోని గ్రామీణభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు దివ్యంగుల సమక్షంలో నిర్వహించారంఈ సందర్బంగా జిల్లా గ్రామీణభివృద్ధి శాఖ అధికారి యం. రఘువరణ్ మాట్లాడుతు అందత్వం, వికలాంగత అనేది శరీరానికే గాని,మనసు కు కాదని, ఆత్మవిశ్వశీతో ఏదైనా అనుకున్నది సాధించవచ్చున్నని హెలెన్ కెల్లర్ నిరూపించారాని, ఆమె అందులకు, దివ్యంగులకు ఆదర్శంగా నిలిచారాని, సెర్ప్ ఆధ్వర్యంలో ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేయడం జరుగుతుందనీ, సదరమ్ ధ్రువీకరణ పత్రం ఉండి, పింఛన్ వస్తున్న ప్రతి ఒక్కరు స్త్రీ, పురుషుడు దివ్యంగుల సంఘాలలో చేరాలని, అందుకోసం సెర్ప్ సిబ్బంది అందుబాటులో ఉంటారని, వారి ద్వారా సంఘాలలో చేరాలని అన్నారు.జిల్లా సంక్షేమ అధికారి ఏ.భాస్కర్ మాట్లాడుతు దివ్యంగుల సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి చేయడం జరుగుతుందనీ, అవసరమైన పరికరాలు, చికిత్సలకు కృషి చేయడం జరుగుతుందనీ అన్నారు. జిల్లా అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ పి. సునీత మాట్లాడుతు సెర్ప్ ఆధ్వర్యంలో దివ్యంగుల కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందనీ,ఉపాధి కోసం ప్రత్యేక యూనిట్ల ఏర్పాటు కూడా చేయడం జరుగుతుందనీ, అర్హులైన ప్రతి దివ్యంగులు తప్పనిసరిగా సంఘాలలో చేరాలని అన్నారు. అంతకుముందు హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పుల మాల వేసి, పువ్వులతో నివాళి అర్పించడం జరిగినది, ప్రత్యేక కేకు ను కోసి వేడుకలు నిర్వహించడం జరిగినది, మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన అంద కళాకారుడు రవి పాడిన పాటలు సభను ఉత్తేజ పరచడం జరిగినది, రవి కి శాలువా తో సన్మానం, ప్రత్యేక చేతి కర్రను అందజేశారు.జిల్లా దివ్యంగుల ప్రాజెక్టు మేనేజర్ ఎస్. రమేష్, జిల్లా పింఛన్ ప్రాజెక్టు మేనేజర్ నాగేశ్వర్ రావు, జిల్లా ఎపియం వి. గంగాధర్, కార్యాలయ సిబ్బంది విజయలక్ష్మి, భాగ్య, కిరణ్ పలువురు సిబ్బంది, ఆయా మండలాల నుండి దివ్యంగులు పాల్గొన్నారు4

## మత్తులో విద్యార్థులు చిత్తు కావద్దు .. -జూ. సివిల్ జడ్జి వి. మాధవి



**నవగీతం, జూన్27, మెట్ పల్లి ప్రతినిధి** మత్తులో విద్యార్థులు చిత్తు కావద్దని మెట్ పల్లి జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి అన్నారు. శనివారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ, నేడు వివిధ రకాల మాదక ద్రవ్యాలు విద్యార్థులకు అందుబాటులోకి రావడం దురదృష్టకరం అన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగ బాధితులకు చట్టపరమైన సేవలు మరియు మాదకద్రవ్యాల ముప్పు నిర్మూలన 2015 పథకం నేటి యువతని రక్షించడం కోసం ప్రభుత్వం రూపొందించినప్పటికి దాని గూర్చి అవగాహన లేక నేటి విద్యార్థులు, యువత మత్తులో చిత్తవుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. పోలిసులు కూడా డ్రగ్స్ వాడకం మరియు విక్రయ ప్రాంతాలపై దృష్టి సారించి వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. డ్రగ్స్ ఆకర్షణకు నేటి టీనేజ్ విద్యార్థులు దూరంగా ఉండి, చదువుపై మాత్రమే దృష్టి సారిస్తే జీవితంలో ఉన్నతంగా రాణిస్తారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులచేత డ్రగ్స్ కి దూరంగా ఉంటాం అని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మేజిస్ట్రేట్ కి కళాశాల అధ్యాపక బృందం శాలువాతో సన్మానం చేసారు. ఈ కార్యక్రమం లో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దయ్యా రాజారాం, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రామ్ రెడ్డి, ఎస్సై పబ్బా కిరణ్ కుమార్, న్యాయవాదులు కోటగిరి వెంకటస్వామి, గడ్డం శంకర్ రెడ్డి, పుప్పాల భాను మూర్తి, తోగిటి రాజ శేఖర్, ఎలాల మధుసూదన్ రెడ్డి, నేరెళ్ల శ్రీధర్, గజెల్లి రామ్ దాస్, తలారి రాజశేఖర్, కోటగిరి చైతన్య, బాస రాములు, ప్రిన్సిపాల్ యస్. దేవరాం , అధ్యాపకులు శ్రీనివాస్, ప్రతిభా, స్వర్ణలత, మంజుల పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్




**నవగీతం,జూన్27,రాయికల్ ప్రతినిధి** రాయికల్ మండలం ధవన్ పల్లి గ్రామంలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేసి,గ్రామానికి చెందిన ఏనుగంటీ గంగమని రాజన్న ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై చీర కానుకగా అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మెన్ కాటిపెళ్ళి గంగారెడ్డి,సర్పంచ్ ప్రసాద్,మాజీ సర్పంచ్ యమున రవి,కోల శ్రీనివాస్,సురేందర్ నాయక్, పాక్స్ చైర్మెన్ ఏనుగు మల్లారెడ్డి, సర్పంచులు గ్రామ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ మాట అంగన్వాడి బాట

ఐసిడిఎస్ సిడిపిఓ జయప్రద ఆధ్వర్యంలో పిల్లలకు యూనిఫామ్ పంపిణీ




**నవగీతం. జూన్27,(రాయికల్ ప్రతినిధి)** రాయికల్ మండలం లోని కొత్తపేట అంగన్వాడి 2 కేంద్రంలో శనివారం రోజున రోజున అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ సిడిపిఓ జయప్రద ఆధ్వర్యంలో మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలకు యూనిఫామ్ లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జగిత్యాల ఐసిడిఎస్ సిడిపిఓ జయప్రద మాట్లాడుతూ అంగన్వాడి విద్య పిల్లల పట్ల పునాదిగా ఉంటుందని, ప్రైవేట్ స్కూల్ల లో పిల్లలకు విద్య మెదడుపై భారం పడి పిల్లల ఎదుగుదలను అనుచుతుందని, ఆడుతూ పాడుతూ విద్య అంగన్వాడిలో అందిస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మీనుగు రాజగంగు అంజయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మావతి, ఉప సర్పంచ్ తునికి రంజిత్, కార్యదర్శి రాజేష్, ప్రధానోపాధ్యాయులు వై.శ్రావణ్ కుమార్, గోపాల్ రావు, ఉపాధ్యాయులు కృష్ణా హరి, అంగన్వాడీ టీచర్లు ఏ.అనురాధ, సిహెచ్.లలిత ఆయమ్మలు బుచ్చమ్మ, శంకరమ్మ, తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 28న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి..

మండల వైద్యాధికారి డా.ఎల్లాల అంజిత్ రెడ్డి




**నవగీతం, జూన్27,( మెట్ పల్లి ప్రతినిధి)** జూన్ 28 రోజున ఆదివారం నిర్వహించనున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదు సంవత్సరాల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని మండల వైద్యాధికారి డా. ఎల్లాల అంజిత్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారతదేశం పోలియో రహిత దేశంగా కొనసాగేందుకు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయడం అత్యంత కీలకమన్నారు. గతంలో పోలియో చుక్కలు వేసినా, పూర్తి టీకాలు తీసుకున్నా కూడా ఈ ప్రత్యేక కార్యక్రమంలో మరోసారి పోలియో చుక్కలు వేయించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు మరియు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్స్ పోలియో బూత్‌లలో ఉదయం 7 గంటల నుండి సాయంత్రం వరకు పోలియో చుక్కలు ఉచితంగా వేయనున్నట్లు తెలిపారు. మొదటి రోజు బూత్‌లలో చుక్కలు వేయించిన అనంతరం, మిగిలిన రోజుల్లో ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన చిన్నారులను గుర్తించి చుక్కలు వేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తారని తెలిపారు. తల్లిదండ్రులు తమ ఐదు సంవత్సరాల లోపు పిల్లలను తప్పకుండా సమీప పోలియో బూత్‌కు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డా. ఎల్లాల అంజిత్ రెడ్డి కోరారు.

## కష్టాల్లో ఉన్న యువకుడికి అండగా నిలిచిన ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ..




**నవగీతం,జూన్27,మల్లాపూర్ ప్రతినిధి:** మల్లాపూర్ మండలం రాఘవపేట గ్రామానికి చెందిన చిట్యాల నాగరాజు ఉపాధి కోసం కొన్ని నెలల క్రితం బహ్రైన్ దేశానికి వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న కంపెనీ నుంచి బయటకు రావడంతో ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.పని కోసం ప్రయత్నించినా అవకాశం దొరకక దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న నాగరాజు విషయం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ దృష్టికి వచ్చింది.. విషయం తెలుసుకున్న వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంజయ్ రాఘవపేట యువకుడు నాగరాజుకు అండగా నిలిచి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వదేశానికి తిరిగి వచ్చేందుకు అవసరమైన దాదాపు ముప్పై వేల విలువ గల విమాన టికెట్‌ను అందించారు.ఆపదలో ఆదుకున్నందుకు ఎమ్మెల్యే కి రాఘవపేట గ్రామ బి ఆర్ ఎస్ నాయకులకు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మద్దెల నర్సయ్య, మాజీ ఉప సర్పంచ్ అమీన్, బి ఆర్ ఎస్వీ నియోజకవర్గ నాయకులు బైరి రవికుమార్ యాదవ్, బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సుద్దు రాజు కుమార్ నాయకులు చిట్యాల నర్సయ్య,బైరి రాకేష్, దేవన్న, సోన్న మినయ్య, మద్దెల స్వామి తదితరులు పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం
28 జూన్ 2026

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికతో పాలన ప్రజలకు మరింత చేరువ

**రాజన్న సిరిసిల్ల :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక తో పాలన ప్రజలకు మరింత చేరువ అయిందని ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి, దేవాదాయ శాఖ, పర్యావరణ,అటవీ శాస్త్ర సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తెలిపారు. మార్చి 6 వ నుంచి జూన్ 12 వరకు 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కింద 10 అంశాలతో వివిధ శాఖల ఆద్వర్యంలో చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు, భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి, దేవాదాయ శాఖ , పర్యావరణ, అటవీ శాస్త్ర మరియు సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ హాజరుకాగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పుష్పగుచ్ఛం అందజేసిస్వాగతం పలికారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి పనులు ప్రజలకు చేరవేయడం, భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించడమే లక్ష్యంగా మార్చి 6నుంచి జూన్ 12 వ వరకు జిల్లాలో చేసిన అభివృధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలు, వివిధ ఫైళ్ల పరిష్కారం, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విజయవంతంపై జిల్లా యంత్రాంగం రూపొందించిన పీపీటీ ప్రదర్శనను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రిన్సిపల్ సెక్రటరీపరిశీలించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి, దేవాదాయ శాఖ, పర్యావరణ, అటవీ శాస్త్ర మరియు సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ.ప్రతి శాఖ భవిష్యత్ కార్యాచరణను స్పష్టంగా నిర్దేశించుకుని, 99 రోజుల కార్యక్రమం ద్వారా సాధించిన విజయాలను డాక్యుమెంటరీ రూపొందించాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేయడం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పురోగతి, డీ అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం, రోడ్డు భద్రతలో భాగంగా సీపీఆర్ శిక్షణ, అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య సంరక్షణ, ఇతర పనుల్లో పురోగతిపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అభినందించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఆర్ఓ జయశ్రీ,





సీపీఓ శ్రీనివాసాచారి, జడ్పీ సీఈవో వెంకట మాధవ రావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పశువైద్య అధికారి రవీందర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆయా మండలాల ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

# అప్రమత్తంగా లేకపోతే అర్హులైన వారి ఓట్లు తొలగిపోయే అవకాశం:

ఓటరు సవరణ ప్రక్రియలో అప్రమత్తంగా లేకపోతే అర్హులైన వారి ఓట్లు తొలగిపోయే అవకాశం ఉందని పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ కోట నీలిమ తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు రాజ్యాంగ ప్రాథమిక హక్కు అని.. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రజలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని సీసీ నగర్ 120, 121 బూత్‌ల్లో డీసీ, ఈఆర్వో సుజాత, బీఎల్ఏ ఆగస్టీన్, బీఎల్వో అరుణ, స్థానిక నాయకులతో కలిసి కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యుమరేషన్ ఫారాల ప్రక్రియను శనివారం ప్రత్యక్షంగా వెళ్లి పరిశీలించారు. ఈ క్రమంలో ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటరు సవరణ ప్రక్రియలో అప్రమత్తంగా లేకపోతే అర్హులైనవారి ఓట్లు తొలగి పోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. బీఎల్‌వోలు ఇచ్చే ఎన్యూమరేషన్ ఫారం నింపి ఇవ్వాలని.. అప్పుడే ఓటు తొలగకుండా ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం రాఖీ నగర్ డివిజన్ 151 బూత్, బీకే గూడ డివిజన్ 205 బూత్ నెంబర్లలో స్థానిక ఃఒంలు అతీక్, బాసిత్ అలీ ఖాన్, ఃబూలు అర్వింద్, సునీత, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కోట నీలిమ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైన రాజ్యాంగబద్ధమైన హక్కు అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు, ప్రజలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ముందుగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్యూమరేషన్ ఫారం నింపాలని సూచించారు. ప్రజలు తమ ఓటరు వివరాలను ఒకసారి తప్పనిసరిగా



పరిశీలించుకోవాలని, అవసరమైతే వెంటనే సవరణలు చేయించుకోవాలని సూచించారు. ఫారం నింపే ప్రక్రియలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేయాలని సూచించారు. ప్రజల ఓటు హక్కు పరిరక్షణ విషయంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ఫారాల పంపిణీ, నింపే ప్రక్రియను పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి అర్హుడైన ఓటరు తన హక్కును కాపాడుకోవడం, ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొనడం ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శంషాబాద్ బస్టాండ్లో ఆర్టీసీ అధికారుల కొరడా

**రంగారెడ్డి :** శంషాబాద్ ఆర్టీసీ బస్సుస్టాండ్లో షట్టర్ల పేరుతో ఏళ్ల తరబడి దందా చేస్తున్న ఎగవేతదారుల ఆటకు తెరపడింది. ప్రభుత్వ సొమ్ముకు ఎగనామం పెట్టి, లక్షలకు లక్షలు జేబులోవేసుకుంటున్న షట్టర్ యజమానులపై ఆర్టీసీ అధికారులు చివరకు కొరడా ఝూలిపించారు! శంషాబాద్ బస్టాండ్ ఆవరణలో ఉన్న 9 కమర్షియల్ షట్టర్లను ఐదేళ్ల క్రితం నెలకు కేవలం5 వేల రూపాయలకు అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే అసలు కథ ఇక్కడే మొదలైంది. ఆర్టీసీకి నెలనెలా కట్టాల్సిన 5 వేలు కట్టకుండా, అదే షట్టర్లను ప్రైవేటు వ్యక్తులకు 20 నుంచి 30 వేల రూపాయలకు అద్దెకు ఇచ్చి నెలనెలా లక్షలు దండుకుంటున్నారు ఈ దళారులు. ప్రభుత్వ సొమ్మును గుంజి సొంత జేబులు నింపుకుంటున్న వీరికి ఆర్టీసీ అధికారులు పలుమార్లు నోటీసులు ఇచ్చినా లెక్కచేయలేదు. 'డబ్బులు కట్టండి' అని మొత్తుకున్నా చెవికెక్కలేదు. లీజు గడువు ముగిసినా, ఖాళీ చేయకుండా దర్జాగా వ్యాపారాలు కొనసాగించారు. ఎగవేతదారుల నిర్లక్ష్యంతో సహనం కోల్పోయిన రాజేంద్రనగర్ డిపో మేనేజర్ కృష్ణారెడ్డి ఈరోజు ఉదయం పోలీసుల సమక్షంలో దాడులు చేశారు. బకాయి పడ్డ 9 షట్టర్లకు నోటీసు బోర్డులు అంటించి సీల్ వేశారు. మిగతా వారికి కూడా గడువులోగా బకాయిలు చెల్లించాలని హెచ్చరిక నోటీసులు జారీ చేశారు.




## నిండు జీవితానికి రెండు చుక్కలు

**0-5 సంవత్సరాల లోపు పిల్లలందరికీపోలియో చుక్కలు వేయించాలి:**

**జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా**




**కరీంనగర్ :** జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి నేడునిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లను వైద్య ఆరోగ్య శాఖ ద్వారా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు.వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అర్హులైన 0-5సంవత్సరల పిల్లలకు చుక్కలు వేసేందుకు పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నేతృత్వంలో బస్టాండు, రైల్వేస్టేషన్లో, పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఇవే కాకుండా మొబైల్ టీంల ద్వారా సమస్యాత్మక ప్రదేశాల్లో ఇటుక బట్టీలు, భవన నిర్మాణ రంగాల ప్రాంతంలో, సిమెంట్ ఫ్యాక్టరీలు,క్వారీలు, బిక్షాటన కొరకు వలస వచ్చిన వారి అర్హులైన పిల్లలను గుర్తించి చుక్కలు వేస్తారని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్యం కేంద్రాలు, బస్తీ దవాఖాన్ లో,అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు తదితర ప్రాంతాల్లో పోలియో చుక్కల పంపిణీ కేంద్రాలను సిద్ధం చేశామని చెప్పారు. అప్పుడే పుట్టిన బిడ్డను మొదలుకొనిఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయాలనే లక్ష్యంతో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణతో పాటు అవసరమైన సూచనలు అందించామని తెలిపారు.దూర ప్రాంతాలు,వలస కుటుంబాల పిల్లలను కూడా గుర్తించి ఒక్క చిన్నారి కూడా 'మిస్' కాకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెప్పారు.తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు.గతంలో పోలియో చుక్కలు వేసినా మరోసారి వేయించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి మరింత పెరుగుతుందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు.

## పిజిఆర్ఎస్ ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారం

**ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించిన జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.**



**తుగ్గలి :** ఒక్క నెల ? ఒక నియోజకవర్గం ? నాలుగు పర్యటనలు కార్యక్రమంలో భాగంగా పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రమైన తుగ్గలి నందు మూడవ విడతలో భాగంగా శనివారం రోజున నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నందు జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు.మండల కేంద్రమైన తుగ్గలి నందు స్థానిక తహసిల్దార్ కార్యాలయం పక్కన నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ కు పత్తికొండ ఆర్డిఓ ఓబులేష్,తుగ్గలి తహసిల్దార్ రవి లు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ లు ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి ఆయా శాఖల అధికారుల సమన్వయంతో సమస్యలు పరిష్కారం చేసే విధంగా చర్యలు చేపట్టారు.ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ముఖ్యంగా రీ సర్వే భూముల సమస్యలు,చుక్కల భూముల సమస్యలు అధికంగా వచ్చాయి.ఎన్నిసార్లు అర్జీలను సమర్పించుకున్న రెవెన్యూ అధికారులు భూ సమస్యలను పరిష్కరించడం లేదని ప్రజలు కలెక్టర్ కు తెలియజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ రైతులకు సంబంధించిన భూ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగేంద్ర, డిప్యూటీ తహసిల్దార్ సుదర్శన్, ఎంఈఓ 1 ప్రవీణ,మెడికల్ ఆఫీసర్ కిరణ్,అమర్నాథ్,ఏవో సురేష్ బాబు, ఎంపీడీవో విశ్వమోహన్,డిప్యూటీ ఎంపీడీవోలు శ్రీహరి,మారుతి ప్రసాద్, ఎంఈఓ 2 రమా వెంకటేశ్వర్లు గౌడ్, ఏపిఎం రాధాకృష్ణ,ఏపీఓ రామకృష్ణ, మండల సర్వేయర్ సుధాకర్,రీసర్వే డిటి మధుమతి,వివిధ శాఖల మండల స్థాయి అధికారులు,పిడిఓ లు, వీఆర్వోలు,విలేజ్ సర్వేయర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తుగ్గలి ఎస్సై నరేష్ తమ పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

## తిమ్మాపూర్ సర్కిల్ కార్యాలయంలో వార్షిక తనిఖీలు చేసిన పోలీసు కమిషనర్ గౌష్ ఆలం.



**కరీంనగర్ :** కరీంనగర్-తిమ్మాపూర్ పోలీస్ శాఖలో పరిపాలనా దక్షత, పారదర్శకతను పెంపొందించే భాగంలో భాగంగా శనివారంనాడు తిమ్మాపూర్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో వార్షిక తనిఖీలను సీపీ గౌష్ ఆలం నిర్వహించారు. ఈ సమగ్ర సమీక్షలో కార్యాలయ రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, మరియు ప్రజల ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియల సామర్థ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు.తనిఖీల్లో భాగంగా కార్యాలయ ప్రాంగణంలోని అంతర్గత, బాహ్య పరిసరాల పరిశుభ్రతను సీపీ నిశితంగా పరిశీలించారు.కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. తిమ్మాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పరిధిలోని స్టేషన్ రికార్డులు, పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు మరియు వాటి దర్యాప్తు పురోగతిని క్షుణ్ణంగా సమీక్షించారు.తిమ్మాపూర్ సర్కిల్ పరిధిలోకి వచ్చే మూడు పోలీస్ స్టేషన్లయిన తిమ్మాపూర్, ఎల్.ఎమ్.డి కాలనీ మరియు చిగురుమామిడిల పనితీరుపై సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించిన సీపీ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, మరియు స్థానిక సమస్యల పరిష్కారంపై చర్చించారు.ప్రస్తుతం సర్కిల్ పరిధిలోని అన్ని రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉందని, కేసుల దర్యాప్తు పురోగతి సంతృప్తికరంగా ఉందని సీపీ పేర్కొన్నారు. సుమారు నెల రోజుల క్రితమే బాధ్యతలు స్వీకరించిన కొత్త సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్, అప్పుడే సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుంటుండటాన్ని ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, తిమ్మాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బొల్లం రమేష్,ఎస్సైలు అన్వర్, గన్నేరువరం ఎస్సై నరేందర్ రెడ్డి ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## బిజినెస్

### లీటరుకు 71 కిమీ మైలేజ్.. ఈ బైక్ ధర ఎంతంటే?



హీరో మోటోకార్ప్ తన ఎంట్రీ లెవల్ కమ్యూటర్ మోటార్‌సైకిల్ అయిన ప్యాషన్ ప్లస్ కొత్త వేరియంట్ లాంచ్ చేసింది. ఇది ఫీచర్ అప్‌గ్రేడ్‌లతో పాటు మెరుగైన భద్రతను అందించే లక్ష్యంతో రూపుదిద్దుకుంది. దీని ధర రూ.84,128 (ఎక్స్ షోరూమ్, ఢిల్లీ). కొత్త వేరియంట్‌లో స్టాండర్డ్ డ్రమ్ బ్రేక్‌కు బదులుగా.. ముందు వైపు డిస్క్ బ్రేక్‌ను అమర్చారు. ఈ అప్‌గ్రేడ్ ముఖ్యంగా అకస్మాత్తుగా బ్రేక్ వేయాల్సి వచ్చే పట్టణ ప్రాంతాల్లో, మెరుగైన బ్రేకింగ్ పనితీరును, నియంత్రణను అందిస్తుందని భావిస్తున్నారు. కొత్త ప్యాషన్ ప్లస్ డిస్క్ హెవీ గ్రే, నెక్సస్ బ్లూ, డార్క్ ఇండస్ట్రియల్ గ్రే, పెర్ల్ రెడ్ అనే నాలుగు డ్యూయల్ టోన్ రంగులలో అందుబాటులో ఉంది. బ్రేకింగ్ అప్‌గ్రేడ్‌తో పాటు, ప్యాషన్ ప్లస్ డిస్క్ పూర్తిగా డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌ను కూడా పొందుతుంది. ఈ కన్సోల్‌లో రియల్ టైమ్ మైలేజ్ ఇండికేటర్, లో ఫ్యూయెల్ వార్నింగ్, సర్వీస్ రిమైండర్స్, కాల్ అండ్ రామీా అలర్ట్‌ల కోసం బ్లూటూత్ కనెక్టివిటీ వంటి ఫీచర్లు ఉన్నాయి. అంతే కాకుండా.. ఈ మోటార్‌సైకిల్‌లో ఎల్ఈడీ ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్, అదనపు భద్రత కోసం సైడ్ స్టాండ్ ఇంజిన్ కట్ ఆఫ్ ఫీచర్, ఖూదీ ఛార్జింగ్ పోర్ట్, యుటిలిటీ స్టోరేజ్ కంపార్ట్‌మెంట్ వంటివి కూడా ఉన్నాయి. మెకానికల్‌గా ఎలాంటి మార్పులు లేవు. కాబట్టి అదే 100 సీసీ ఇంజన్‌తో పనిచేస్తుంది, ఇది 8,000 ఆర్‌పీఎమ్ వద్ద 5.9 కిలోవాట్ల పవర్, 6,000 ఆర్‌పీఎమ్ వద్ద 8.05 ఎన్‌ఎమ్ పీక్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ ఇంజన్ హీరో ఐ3ఎస్ (ఐడిల్ స్టాప్-స్టార్ట్ సిస్టమ్)తో కలిసి పనిచేస్తుంది. ఇది ఇంధన సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఈ బైక్ 71 కిమీ/లీ మైలేజ్ ఉస్తుందని కంపెనీ చెబుతోంది.

## రోజుకు కేవలం రూ.50 పెట్టుబడితో

# చేతికి రూ.35 లక్షలు



నెలాఖరున జీతం లేదా సంపాదన ఎంత ఉన్నప్పటికీ, భవిష్యత్తులో ఎవరి ముందూ చేతులు చాచాల్సిన అవసరం లేకుండా ఉండేందుకు పొదుపు చేయడం అవసరం. కానీ ఈ ద్రవ్యోల్బణ యుగంలో రోజువారీ జీవితంలోని అన్ని ఖర్చులను భరిస్తూ పొదుపు చేయడం ఎల్లప్పుడూ సాధ్యం కాదు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని, మీకు తపాలా కార్యాలయం వారి ఒక పథకం గురించి తెలియజేస్తున్నాము. దీని ద్వారా మీరు ప్రతిరోజూ కేవలం 50 రూపాయలు పొదుపు చేయడం ద్వారా 35 లక్షల వరకు నిధిని సృష్టించుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పథకమే 'గ్రామ సురక్షా యోజన'. దీని గురించి తెలుసుకుందాం..

**ఈ పథకం ప్రత్యేకత ఏమిటి?**

పోస్ట్ ఆఫీస్ గ్రామ సురక్షా యోజన అనేది గ్రామీణ తపాలా జీవిత బీమా కింద ప్రభుత్వం నడిపే ఒక పూర్తి జీవిత బీమా పాలసీ. దీనిని బీమా, దీర్ఘకాలిక పొదుపుల కలయికగా చూడవచ్చు. ఇది చిన్న పెట్టుబడిపై మంచి రాబడిని అందిస్తుంది. ఈ పథకంలో పెట్టుబడి పెట్టాలనుకునే వారు భారతీయులై ఉండాలి. 19 నుంచి 55 సంవత్సరాల మధ్య వయసు ఉండాలి. 55 ఏళ్లు, 58 సంవత్సరాలు, 60 ఏళ్లు ఇలా ఈ మూడింట్లో ఒకదానిని మెచ్యూరిటీ పీరియడ్?గా ఎంచుకోవచ్చు. ఈ స్కీమ్‌లో కనిష్ఠంగా రూ.10,000 నుంచి గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. నెలవారీగా, మూడు నెలలు, ఆరు నెలలకు ఓసారి ప్రీమియంలు చెల్లించవచ్చు.

**ప్రయోజనాలు:**

ఈ పథకం కింద 80 ఏళ్లు నిండిన వ్యక్తికి మెచ్యూరిటీ మొత్తాన్ని అందిస్తారు. ఒకవేళ పాలసీదారుడు మరణిస్తే.. ఈ మొత్తాన్ని నామినీకి అందిస్తారు. పథకంలో చేరిన మూడు సంవత్సరాల తరవాత పాలసీదారుడు ఈ పథకాన్ని నిలిపేయవచ్చు. అయితే పథకంలో చేరిన 5 సంవత్సరాల లోపు సరెండర్? చేస్తే బోనస్? రాదు. పథకంలో చేరిన నాలుగు సంవత్సరాల తర్వాత లోన్? తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ పాలసీలో అతిపెద్ద హైలైట్ తపాలా శాఖ అందించే బోనస్. తపాలా శాఖ ప్రకటించిన ప్రకారం ప్రతి రూ.1,000కి సంవత్సరానికి రూ.60ల బోనస్? అందుతుంది.

**నెలకు ఎంత ప్రీమియం చెల్లించాలి?**


ఈ గ్రామ సురక్ష యోజన స్కీమ్‌లో చేరిన వ్యక్తి ప్రతి నెలకు ఎంత కట్టాలి అనేది మీ వయసు, మెచ్యూరిటీ పీరియడ్?, బీమా మొత్తం వంటి వాటి మీద ఆధారపడి ఉంటుందని గుర్తించుకోండి. ఉదాహరణకు ఒక వ్యక్తి 19 సంవత్సరాల వయస్సులో రూ.10 లక్షల బీమా పాలసీ తీసుకుని 55 ఏళ్ల మెచ్యూరిటీ ఎంచుకుంటే అతను నెలకు రూ.1,515 లను ప్రీమియంగా చెల్లించాలి. అంటే రోజుకు 50 రూపాయలు. అతను 58 సంవత్సరాలు అయితే నెలకు రూ.1,463, 60 సంవత్సరాల వరకు స్కీమ్‌లో ఉంటే నెలకు రూ.1,411లను చెల్లించాలి. ప్రీమియం సకాలంలో చెల్లించకపోతే 30 రోజుల్లోపు డిపాజిట్ చేయవచ్చు.

**రాబడి ఎలా ఉంటుంది ?:**

మీరు స్కీమ్‌లో ఎన్ని సంవత్సరాలు పొదుపు చేశారు.. అనే దాని ఆధారంగా రాబడిని నిర్ణయిస్తారని గుర్తించుకోండి. మీరు 55 ఏళ్ల వరకు స్కీమ్‌లో పెట్టుబడి పెడితే మీకు రూ.31.60 లక్షలు, అదే 58 ఏళ్లు అయితే 32.40 లక్షలు, 60 ఏళ్ల వయస్సు వరకు పెట్టుబడి పెడితే రూ.34 లక్షలు మెచ్యూరిటీ సమయంలో వస్తాయి.

## ఛత్తీస్‌గఢ్ పంట పండింది..! బయటపడ్డ భారీ వజ్రాల గని

ఛత్తీస్‌గఢ్ ఖనిజ సంపద ముఖచిత్రాన్ని మార్చేసే దిశగా ఒక కీలక అడుగు పడింది. రాష్ట్రంలో భారీ వజ్రాల గని ఉనికి చాటుకుంది. న్యూఢిల్లీలో జరిగిన ఎన్‌ఎమ్‌డిసి-సిఎమ్‌డిసి లిమిటెడ్ (చీజూ) డైరెక్టర్ల బోర్డు సమావేశంలో, మహాసముంద్ జిల్లాలోని 'బలోడా-బెల్మొండి' డైమండ్ బ్లాక్‌లో డ్రిల్లింగ్‌ను ప్రారంభించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాంతంలో ఉన్న అసలైన వజ్ర నిల్వలను శాస్త్రీయంగా అంచనా వేయడానికి, భవిష్యత్తులో వాణిజ్యపరంగా తవ్వకాలు జరపడానికి ఈ నిర్ణయం ఎంతో కీలకం కానుంది. చీజూ సంస్థ ఇప్పటికే ఈ ప్రాంతంలో ప్రవాహ అవక్షేప నమూనాల సేకరణ, భూభౌతిక సర్వేలు, లక్షిత డ్రిల్లింగ్ ద్వారా వజ్రాలు లభించే 'కింబర్లైట్ పైపు'ను గుర్తించింది. ఇక్కడి నుండి సేకరించిన సుమారు 200 టన్నుల భారీ నమూనాను మధ్యప్రదేశ్‌లోని ఎన్‌ఎమ్‌డిసి 'పన్నా డైమండ్ ప్రాసెసింగ్ ప్లాంట్'లో పరీక్షించగా.. 1.22 క్యారెట్ల బరువున్న ఐదు సహజ వజ్రాలు లభించాయి. దీంతో ఇక్కడ వజ్రాల నిక్షేపాలు ఉన్నట్లు శాస్త్రీయంగా నిర్ధారణ అయింది. కెనడా, ఆస్ట్రేలియా, బోట్స్వానా, దక్షిణాఫ్రికా వంటి అంతర్జాతీయ దేశాల అనుభవాల ప్రకారం.. ప్రారంభంలో ఇలాంటి ఫలితాలు వస్తే, భవిష్యత్తులో అక్కడ భారీ వాణిజ్య నిల్వలు బయటపడే అవకాశం ఉంది. అందువల్ల ఈ ప్రాజెక్టును దేశంలోనే అత్యంత కీలకమైన ఖనిజ ప్రాజెక్ట్‌గా భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన చీవీణజ లిమిటెడ్, ఛత్తీస్‌గఢ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ భాగస్వామ్యంతో ఏర్పడిన జాయింట్ వెంచరే ఈ చీజూ. ఇప్పటివరకు కేవలం ఇనుప ఖనిజ ప్రాజెక్టులపైనే దృష్టి పెట్టింది ఈ సంస్థ. ఇప్పుడు బహుళ-ఖనిజ అభివృద్ధి వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో వజ్రాల గనితో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రధాన ఇనుప ఖనిజ ప్రాజెక్టులను కూడా సమీక్షించారు. బైలాడిల డిపాజిట్-4లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 10 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని



నిర్దేశించుకోగా, దీనిని క్రమంగా ఏటా 70 లక్షల టన్నులకు పెంచనున్నారు.

## వికాస్, అభిరథ్ విధ్వంసం..

# హైదరాబాద్ హ్యాట్రిక్

టీజీ20 లీగ్ 2026లో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ వరుస విజయాలతో దూసుకుపోతుంది. వరుసగా మూడో మ్యాచ్‌లో విజయం? సాధించి హ్యాట్రిక్ నమోదు చేసింది. ఇవాళ జరిగిన 12వ మ్యాచ్‌లో మెదక్ ఫాల్కన్స్‌పై 46 పరుగుల తేడాతో గెలుపొందింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 240 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఓపెనర్లు అభిరథ్ రెడ్డి (59), వికాస్ రెడ్డి (93) విధ్వంసకర అర్ధ శతకాలతో విరుచుకుపడ్డారు. ఆఖర్లో గడుగు గణేశ్ (22 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. మెదక్ బౌలర్లలో విక్రమ్ నాయక్, ఘాజీ అబ్బాస్ చెరో 2 వికెట్లు తీయగా.. వరుణ్, కార్తికేయ, రవితేజ, అశ్విన్ రామ్ తలో వికెట్ తీశారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనను మెదక్ కూడా ధీటుగానే ప్రారంభించినప్పటికీ.. 12వ ఓవర్ తర్వాత ?స్వల్ప విరామాల్లో 6 వికెట్లు కోల్పోయి ఓటమిపాలైంది. అజయ్ దేవ్ గౌడ్ (4-0-20-4), ప్రణవ్ వర్మ (4-0-35-2) అద్భుతంగా బౌలింగ్ చేసి మెదక్‌కు దెబ్బకొట్టారు. శ్రీనికేత్, నితన్ నాయక్ తలో వికెట్ తీశారు. మెదక్ బ్యాటర్లలో విక్రమ్ నాయక్ (75) ఒంటరిపోరాటం చేశాడు. వరుణ్ యెర్రమ్ (38), రవితేజ (31), ఇషాన్ శర్మ (27) రెండంకెల స్కోర్లు చేయగా.. మిగతా ఆటగాళ్లంతా సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు. ఈ గెలుపుతో



హైదారాబాద్ రన్‌రేట్‌ను భారీగా మెరుగుపర్చుకొని పాయింట్ల పట్టికలో సోలోగా అగ్రస్థానంలో నిలిచింది.

### విరాట్ కోహ్లీకి సంబంధించి బిగ్ న్యూస్

భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి సంబంధించి ఓ బిగ్ న్యూస్ అందింది. త్వరలో అతడు వన్డే సిరీస్ కోసం ఇంగ్లండ్‌కు వెళ్లాల్సి ఉన్నా, ఇంకా బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు)లోనే ఉన్నాడు. విరాట్ ఐపీఎల్ 2026 ఫైనల్లో గాయపడిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి అతడు పునరావాస కార్యక్రమంలోనే ఉన్నట్లు తెలుస్తోంది.
గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఐపీఎల్ 2026 ఫైనల్లో విరాట్ హ్యామ్‌స్ట్రింగ్‌కు గాయమైంది. గాయం ఉన్నప్పటికీ అతడు మొత్తం ఇన్నింగ్స్ ఆడి జట్టుకు విజయాన్ని అందించాడు. అయితే ఆ తర్వాత ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు.

**ఫిట్‌నెస్ క్లియరెన్స్ వచ్చినట్టే.. కానీ..?**

ఇంగ్లండ్ సిరీస్‌కు ముందు విరాట్ జశీజులో ఫిట్‌నెస్ టెస్ట్ పూర్తి చేశాడని, అతడికి క్లియరెన్స్ కూడా లభించిందని పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి. అందుకే అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ అతడిని జట్టులోకి ఎంపిక చేసినట్లు సమాచారం. అయితే తాజాగా భారత అండర్-19 కెప్టెన్ ఆయుశ్ మాత్రేతో కలిసి విరాట్ జశీజులో కనిపించాడు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో అతడు ఇంకా రిహాబిలిటేషన్‌లోనే ఉన్నాడా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇంగ్లండ్‌తో 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్ జులై 14 నుంచి ప్రారంభమవుతుంది. దీనికి ముందు భారత జట్టు ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడుతుంది. విరాట్ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం టీమిండియా ఐర్లాండ్‌తో రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడుతుంది. ఈ సిరీస్‌లో భాగంగా నిన్న జరిగిన తొలి టీ20లో భారత్ చిత్తుగా ఓడింది. విరాట్‌కు డిస్టల్ సెమిమెంబ్రానోసస్ టెండన్ టియర్ అనే అరుదైన హ్యామ్‌స్ట్రింగ్ గాయం అయినట్లు సమాచారం. ఇది మోకాలి వెనుక భాగంలో ఉండే హ్యామ్‌స్ట్రింగ్ కండరానికి సంబంధించిన గాయం. దీని నుంచి పూర్తిగా కోలుకోవడానికి సాధారణంగా 6 నుంచి 12 వారాలు పట్టే అవకాశం ఉంటుంది. గాయం తీవ్రతను బట్టి కొన్నిసార్లు శస్త్రచికిత్స కూడా అవసరమవుతుంది.

## స్పోర్ట్స్

### నబీకి నాలుగు వికెట్లు.. భారత్-ఏకు స్వల్ప ఆధిక్యం..!



మొదటి అనధికారిక టెస్టులో భారత ఏ బౌలర్ల ధాటికి రోజున్నరకే శ్రీలంక ఏ ఆలౌటైంది. అకీబ్ నబీ దార్(4-58) పేస్‌ను ఎదుర్కోలేక అతిథ్య జట్టు బ్యాటర్లు తోకముడవగా.. 330 రన్స్‌కే కుప్పకూలింది. దాంతో, భారత ఏ జట్టుకు 160 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లోనూ టీమిండియాకు శుభారంభమివ్వాలనుకున్న ఓపెనర్ సాయి సుదర్శన్(7) రిటైర్డ్ హర్టయ్యాడు. ప్రస్తుతం ఆయుష్ పాండే, దేవ్‌దత్ పడిక్కల్ ఆడుతున్నారు. గాలే స్టేడియంలో జరుగుతున్న మొదటి అనధికారిక టెస్టులో భారత ఏ పట్టుబిగించింది. రంజీ వీరుడు అకీబ్ నబీ(4-58) బంతితో విజృంభించగా మూడోరోజే శ్రీలంక ఏ కుప్పకూలింది. ఓవర్ నైట్ స్కోర్ 113/2తో ఇన్నింగ్స్ మొదలెట్టిన లంకను యశ్ ఠాకూర్(2-51) దెబ్బకొట్టాడు. అర్ధశతకంతో విసిగించిన నువనిందు ఫెర్నాండో(84)ను ఔట్ చేసిన ఠాకూర్ వికెట్ల వేటకు తెరతీశాడు. అంజల బండార(70)ను వెనక్కి పంపిన నబీ.. లోయర్ ఆర్డర్‌ను పడగొట్టాడు. నబీ ధాటికి శ్రీలంక ఏ 330 పరుగులకే ఆలౌటైంది.

సాయి, జురెల్ సెంచరీ..

ఓపెనర్ సాయి సుదర్శన్(132), ఆయుష్ పాండే(25)లు భారత ఏ జట్టుకు శుభారంభమిచ్చారు. తొలి వికెట్‌కు 92 రన్స్ జోడించిన సాయి.. ఆ తర్వాత దేవ్‌దత్ పడిక్కల్(12), రుతురాజ్ గైక్వాడ్(22)లతో విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పాడు. షేక్ రషీద్(63), ధ్రువ్ జురెల్(141 నాటౌట్) మెరవగా.. తొలి రోజే 4 వికెట్ల నష్టానికి 333 రన్స్ కొట్టిన భారత్.. రెండో రోజూ జోరు చూపింది. రషీద్‌తో కీలక భాగస్వామ్యం నెలకొల్పిన జురెల్ రెండో రోజు లంక బౌలర్లను పరీక్షించాడు. హర్ష్ దూబే(30)తో కలిసి స్కోర్ నాలుగొందలు దాటించాడు. దూబేను గుణశేఖర( 3-84) ఔట్ చేశాక 452-6 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది భారత ఏ.

# మైత్రీ మూవీ మేకర్స్‌తో నవీన్ పోలిశెట్టి పాన్ ఇండియా ప్రాజెక్ట్!



టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో నవీన్ పోలిశెట్టి తన తదుపరి క్రేజీ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించేందుకు సర్వం సిద్ధం చేసుకున్నాడు. 'అనగనగా ఒక రాజు' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా, వంద కోట్ల క్లబ్‌లో చేరి తన మార్కెట్ స్టామినాను నిరూపించుకున్న నవీన్.. ఏమాత్రం ఆలస్యం చేయకుండా తన కొత్త సినిమాను లైన్లో పెట్టాడు. టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ అయిన మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించబోతుంది. నవీన్ పోలిశెట్టి మార్కెట్ పరిధిని దృష్టిలో ఉంచుకుని ఈ కలయికపై మైత్రీ సంస్థ చాలా నమ్మకంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన రాకముందే నవీన్ పోలిశెట్టి సోషల్ మీడియా వేదికగా చేసిన ఒక వినూత్న ప్రమోషన్ ప్రస్తుతం నెట్టింట సంచలనంగా మారింది. సినీ ఇండస్ట్రీలోని నలుగురు టాప్ కమర్షియల్ డైరెక్టర్స్ ప్రశాంత్ నీల్, సుకుమార్, లోకేష్ కనగరాజ్, మరియు రిషబ్ శెట్టిలతో కలిసి దిగిన ఒక అదిరిపోయే ఫన్నీ రీల్‌ను ఆయన షేర్ చేశాడు. ఈ దర్శకుల సినిమాల బాక్సాఫీస్ వసూళ్లను ఉద్దేశిస్తూ.. దీనిని తన కెరీర్‌లోనే అత్యంత ఖరీదైన 'రూ. 5000 కోట్ల ఫ్రేమ్' అని నవీన్ చమత్కరించాడు. ఈ వైరల్ వీడియో ద్వారా మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో తన తదుపరి చిత్రం రాబోతోందని నవీన్ క్లారిటీ ఇచ్చాడు. దీనికి స్పందనగా మైత్రీ మూవీ మేకర్స్ కూడా నవీన్‌ను తమ ప్రొడక్షన్ ఫ్యామిలీలోకి ఆహ్వానిస్తూ.. ఒక ఫుల్-ఆన్ ఎంటర్‌టైనర్ లోడింగ్ అవుతోందని వెల్లడించింది. అయితే ఈ సరికొత్త ప్రాజెక్ట్‌ను పూర్తి స్థాయి క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించనున్నారు. 'సైరన్' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న తమిళ దర్శకుడు ఆంటోనీ భాగ్యరాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు సినీ వర్గాల్లో గట్టి ప్రచారం సాగుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ ఈ కాంబినేషన్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. ప్రస్తుతం స్క్రిప్టింగ్, ప్రీ-ప్రొడక్షన్ పనులను వేగవంతం చేసిన చిత్ర బృందం, త్వరలోనే షూటింగ్‌ను ప్రారంభించి, వచ్చే ఏడాది ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి ప్లాన్ చేస్తోంది. నవీన్ పోలిశెట్టి అద్భుతమైన కామిక్ టైమింగ్, ఆంటోనీ భాగ్యరాజ్ టేకింగ్, మరియు మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువల కలయికలో రాబోతున్న ఈ చిత్రంపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు మరియు నటీనటుల అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుంది.

# బాలయ్యను పక్కనపెట్టిన బోయపాటి.. సూర్యతో పాన్ ఇండియా యాక్షన్ మూవీకి గ్రీన్ సిగ్నల్?



టాలీవుడ్‌లో మాస్ యాక్షన్ సినిమాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన దర్శకుడు బోయపాటి శ్రీను తన తదుపరి ప్రాజెక్ట్‌తో మరోసారి చర్చల్లో నిలిచారు. నందమూరి బాలకృష్ణతో వరుస బ్లాక్‌బస్టర్ చిత్రాలను అందించిన బోయపాటి, ఇప్పుడు కోలీవుడ్ స్టార్ హీరో సూర్యతో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బోయపాటి శ్రీను కెరీర్‌లో అత్యంత విజయవంతమైన కాంబినేషన్ అంటే బాలకృష్ణతో చేసిన సినిమాలే. వీరిద్దరి కలయికలో వచ్చిన 'సింహా', 'లెజెండ్', 'అఖండ' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాలను నమోదు చేశాయి. ముఖ్యంగా బాలయ్యను మాస్ అవతార్‌లో చూపించడంలో బోయపాటి తనదైన శైలిని ప్రదర్శించారు. ఈ చిత్రాలు ప్రేక్షకులను అలరించడమే కాకుండా, టాలీవుడ్‌లో ఈ కాంబినేషన్‌కు ప్రత్యేకమైన క్రేజ్‌ను తీసుకొచ్చాయి. అయితే బాలకృష్ణ మినహా ఇతర స్టార్ హీరోలతో బోయపాటి తెరకెక్కించిన కొన్ని చిత్రాలు ఆశించిన స్థాయిలో విజయాలు సాధించలేకపోయాయి. దీంతో తన తదుపరి ప్రాజెక్ట్ విషయంలో బోయపాటి మరింత జాగ్రత్తగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం, తమిళ స్టార్ హీరో సూర్య కోసం బోయపాటి శ్రీను ఒక పవర్‌ఫుల్ యాక్షన్ కథను సిద్ధం చేశారట. ఇటీవల ఈ కథను సూర్యకు వినిపించగా, ఆయన కథపై సానుకూలంగా స్పందించినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. సూర్య నటనకు బోయపాటి మాస్ ఎలివేషన్స్, హై వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలు జత అయితే ప్రేక్షకులకు కొత్త అనుభూతి కలిగే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను తెలుగు, తమిళంతో పాటు పలు భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో రూపొందించే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఉత్తరాది ప్రేక్షకులను కూడా ఆకట్టుకునేలా కథ, యాక్షన్ ఎలిమెంట్స్‌ను రూపొందిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు ప్రారంభమైనట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది. ఇటీవల సూర్య నటించిన చిత్రాలు మంచి విజయాలను అందుకుంటున్నాయి. ఆయన ప్రస్తుతం వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక బోయపాటి-సూర్య కాంబినేషన్ నిజమైతే, అది దక్షిణాది సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలిచే అవకాశం ఉంది. సూర్యతో బోయపాటి సినిమా గురించి ప్రస్తుతం పరిశ్రమలో విస్తృతంగా చర్చ జరుగుతున్నప్పటికీ, చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ కాంబినేషన్ నిజమైతే బోయపాటి శ్రీను మరోసారి మాస్ యాక్షన్ దర్శకుడిగా తన సత్తా చాటుకునే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# అల్లు అర్జున్ అట్లీ 'రాకా'లో రష్మిక మందన్న.. విలన్ పాత్రలో శ్రీవల్లి?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'రాకా' గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక క్రేజీ అప్‌డేట్ తెగ హల్‌చల్ చేస్తోంది. 'పుష్ప', 'పుష్ప 2' చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసిన అల్లు అర్జున్, రష్మిక మందన్న హిట్ కాంబో ఈ సినిమాతో మరోసారి రిపీట్ కాబోతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో బలమైన వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈసారి వీరిద్దరి కాంబినేషన్ మరింత విభిన్నంగా ఉండబోతోందని సమాచారం. ఇప్పటివరకు బన్నీతో కేవలం రొమాన్స్ చేసిన రష్మిక, ఈ సినిమాలో సరికొత్తగా నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతుందని టాక్ నడుస్తోంది. కథను పూర్తిగా మలుపు తిప్పే ఒక కీలకమైన పాత్ర కోసం దర్శకుడు అట్లీ ఆమెను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ముంబైలో జరుగుతున్న భారీ యాక్షన్ షెడ్యూల్‌లో రష్మిక కూడా జాయిన్ అయినట్లు బాలీవుడ్ వర్గాల సమాచారం. 'పుష్ప' సిరీస్ బ్లాక్‌బస్టర్ హిట్ అవ్వడంతో అల్లు అర్జున్‌కి రష్మిక ఒక 'లక్కీ చార్మ్' అని, అందుకే ఆమెను ఈ ప్రాజెక్ట్‌లోకి తీసుకున్నారని ఫ్యాన్స్ భావిస్తున్నారు. కాగా, ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ప్రధాన నాయికగా నటిస్తుండగా, రష్మికతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా కీలక పాత్రలు పోషిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు బాలీవుడ్ కింగ్ ఖాన్ షారుక్ ఖాన్ కూడా ఈ సినిమాలో ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో మెరవనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రేజీ తారాగణంతో అంచనాలను పెంచేస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై చిత్ర యూనిట్ నుండి త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

## సొంత అపార్ట్‌మెంట్ ఖాళీ చేయనున్న సల్మాన్ ఖాన్.. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులే కారణం



బాలీవుడు సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ తనతోపాటు కుటుంబ సభ్యుల భద్రత విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన ఉంటున్న ముంబై, బాంద్రాలోని గెలాక్సీ లగ్జరీ అపార్ట్‌మెంట్‌ను ఖాళీ చేయాలని నిర్ణయించారు. తనకు మరింత భద్రత కల్పించే కొత్త బిల్డింగులోకి మారబోతున్నారు. దాదాపు 50 ఏళ్లుగా ఉంటున్న ఇంటిని విడిచిపెట్టబోతున్నారు. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి తరచూ బెదిరింపులు, తన ఇంటివద్ద కాల్పుల నేపథ్యంలో సల్మాన్ ఖాన్ కొత్త ఇంటిలోకి మారాలని నిర్ణయించుకున్నారు. సముద్రం ఎదురుగా, ఆరంతస్తుల బిల్డింగ్ నిర్మాణానికి ప్రభుత్వ అనుమతులు కూడా లభించాయి. మహారాష్ట్ర కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఈ నెల 16న అనుమతులు మంజూరు చేసింది. దీంతో బాంద్రాలోని చింబాయ్ ప్రాంతంలో త్వరలోనే ఇంటి నిర్మాణం ప్రారంభం కానుంది. ఈ ఇంటి నిర్మాణం పూర్తైన తర్వాత ఆయన గెలాక్సీ అపార్ట్‌మెంట్ వదిలి ఇక్కడికి వస్తారు. సల్మాన్ తాను ప్రస్తుతం ఉంటున్న గెలాక్సీ అపార్ట్‌మెంట్ ఏరియాలో 1974 నుంచి ఉంటున్నారు. దీనికి సమీపంలోనే కొత్త అపార్ట్‌మెంట్ నిర్మించబోతున్నారు. ఇక్కడ సల్మాన్ తనతోపాటు కుటుంబ సభ్యులతో ఇక్కడే ఉండబోతున్నారు. కొత్త ఇల్లు 1,014 చదరపు మీటర్లలో ఉండనుంది. గ్రౌండ్ ఫ్లోర్, స్టిల్ట్ పార్కింగ్ కాకుండా మరో ఆరు ఫ్లోర్లతో దీన్ని నిర్మించనున్నారు.

# దసరా బరిలో వెంకీమామ.. 'ఆదర్శ కుటుంబం' విడుదల తేదీ ఖరారు!

విక్టరీ వెంకటేష్, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ఆదర్శ కుటుంబం' విడుదల తేదీ అధికారికంగా ఖరారైంది. వెంకటేష్ కెరీర్‌లో 77వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను గాంధీ జయంతి సందర్భంగా, అక్టోబర్ 2వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ మేరకు "ప్రతి కుటుంబం గుర్తుపెట్టుకోవాల్సిన తేదీ.. అక్టోబర్ 2న ఆదర్శ కుటుంబం తలుపులు తెరుచుకోబోతున్నాయి" అంటూ మేకర్స్ ఒక ప్రత్యేక ప్రకటనను విడుదల చేశారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో వెంకటేష్ సరసన కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు), వంశీ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తుండగా, ప్రఖ్యాత ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అలాగే పి.ఎస్. వినోద్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న మొదటి పూర్తి స్థాయి చిత్రం కావడంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.



Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001.
Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184.
Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.